లక్ష్యం
సమస్యమీది...! పరిష్కారం మాది..!
'లక్ష్యం దిన పత్రిక' పాఠకుల అభిరుచి మేరకు ఓ వినుత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.
మీ ప్రాంత అభివృద్ధి నేపధ్యంలో వెనుకుబాటుతనానికి కారణాలు ఫోటోతో ఒక చిన్న కామెంట్ పెడితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయా ప్రాంత 'లక్ష్యం' పాత్రికేయ బృందం పరిశీలించి వార్త రూపంలో పత్రికాముఖంగా సమస్యను రాజకీయ, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తుంది.
ప్రజాచైతన్యమే లక్ష్యం గా ....
మీ ముందుకు వస్తున్నది. ఇంక ఎందుకు ఆలస్యం..!
సంప్రదించవలసిన మొబైల్ నెంబర్స్ :
కె. శ్యామ్
రీజనల్ మేనేజర్,
సెల్: 63042 20819
లక్ష్యం గ్రూప్ ఆఫ్ మీడియా

ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక

లక్ష్యం
విలేఖరులు కావలెను
లక్ష్యం TV NEWS
లక్ష్యం దిన పత్రిక 13 వసంతాలు పూర్తిచేసుకొని 14 వ వసంతంలో అడుగిడిన నేపధ్యంలో " తెలుగు రాష్ట్రాల్లో అపార అభిమానం పొంది ఎందరో పాఠకుల మానస పుత్రికగా వెలుగొందుతున్న లక్ష్యం తెలుగ దిన పత్రికకు"
తెలుగు రాష్ట్రాల్లో జిల్లా వారీగా బ్యూరో ఇంచార్జీలు కావలెను.
లక్ష్యం మాస పత్రికకు & లక్ష్యం టీవి కి జిల్లాలవారీగా బ్యూరో ఇంచార్జీలు కావలెను.
ప్రజా చైతన్యమే... లక్ష్యం తెలుగు దినపత్రిక
కె. శ్యామ్
రీజనల్ మేనేజర్,
సెల్: 63042 20819
లక్ష్యం గ్రూప్ ఆఫ్ మీడియా

ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి: 1 సంచిక: 362 బుధవారం 25-2-2026 పేజీలు : 8 వెల: 3/-


LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

# నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి

- తిరుమల గిరులను కుదించారు... కల్తీతో అపవిత్రం చేశారు
- తిరుమల డిక్లరేషన్ పై జగన్ ధిక్కారం
- గత పాలనలో టీటీడీలో ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం
- జరిగిన అపచారాలపై తీవ్రంగా స్పందించిన హైందవ మతాలు
- కల్తీకి ఆస్కారం లేని విధంగా కఠినతరంగా నిబంధనలు
- హిందువుల మనోభావాలు కాపాడే బాధ్యత మాది
- కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ హయాంలో మహాపాపం పేరిట సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎం



2



అమరావతి, ఫిబ్రవరి 24:లక్ష్యం న్యూస్

ఓ పద్ధతి ప్రకారమే 2005 నుంచి హిందూమతంపై దాడి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పరిధిని ఏడు కొండల నుంచి రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని అప్పటి నుంచే హిందూ మతంపై క్రమబద్ధంగా దాడి చేస్తూ వచ్చారని ఆక్షేపించారు. అప్పటి పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శామ్యూల్ అనే క్రైస్తవ అధికారి ఈ జీవో జారీ చేశారని వివరించారు. హిందూ సమాజంతో పాటు రెండేళ్ల పాటు తాము చేసిన పోరాటాల కారణంగా వెనక్కు తగ్గారని సీఎం స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో చేపట్టిన లఘు చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వ్యవహారంపై మహాపాపం పేరిట అసెంబ్లీలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ వివాదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో సిట్ ఏర్పాటైందని సీఎం వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. తప్పు చేసిన నిందితులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని అన్నారు. అందుకే ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. లడ్డూ వ్యవహారంలో అనేక తప్పులు చేశారని సీఎం స్పష్టం చేశారు. 2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారని అన్నారు. రూ. 231.51 కోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని నీరుగార్చారని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఓ ప్రణాళిక ప్రకారం లాలూచీ పడిన లూటి అని స్పష్టంగా తేలిందన్నారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా... నివేదికలు వచ్చినా అప్పటి టీటీడీ ఛైర్మన్ దానిని తొక్కి పెట్టారని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని తానేమి సొంతగా చెప్పలేదని ఎన్డీడీబీ కాఫ్ ఇచ్చిన నివేదికనే బయటకు వెల్లడించానని అన్నారు.

**అప్పటి బోర్డుకు, ఛైర్మన్ కు తెలియకుండా తప్పులు జరిగాయా...?**

కల్తీ నెయ్యి సరఫరాకు అనుగుణంగా టెండర్ నిబంధనల్ని సడలించారని.. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సరఫరా చేయాలన్న నిబంధన తొలగించారని పేర్కొన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏడాదికి కుదించారన్నారు. రోజుకు 12 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారని అన్నారు. అక్రమాలకు తెరతీసేలా డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారన్నారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని.. వీటితో పాటు ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని కూడా నీరుగార్చారన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా పోమిల్ జైన్ , విపిన్ జైన్ తో పాటు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ఉందన్నారు. ఏఆర్, శ్రీవైష్ణవీ, మాల్ గంగా డెయిరీలు భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలుగా వ్యవహరించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని సీఎం స్పష్టం చేశారు. రూ.4.5 కోట్ల లంచం డబ్బుతో నాటి ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న అడ్డంగా దొరికి పోయారని సీఎం తెలిపారు. తప్పుడు రిటర్నులతో తప్పుదారి పట్టించారని.. ల్యాబ్ నివేదికల్ని కూడా ఫోర్జరీ చేశారన్నారు. ల్యాబ్ ల కన్నుగప్పి టెండర్లు దక్కించుకున్నారని అన్నారు. కల్తీ నెయ్యి తయారీకి, సరఫరాకు ఓ ముఠాగా ఏర్పడ్డారని... తయారికి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు కూడా సిట్ తేల్చిందన్నారు. శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. టీటీడీలోని సాంకేతిక నిపుణులకు కూడా ఖరీదైన ఫోన్లు ఎరవేసి కల్తీ నెయ్యికి గేట్లు తెరిచారన్నారు. మోనో గ్లిసరైట్, ఎసిటిక్ యాసిడ్ లాంటి డ్రమ్ములను, లంచాల వివరాలతో కూడిన డైరీని కూడా సిట్ స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ కుట్రకు పాల్పడిన నిందితులపై సిట్ అభియోగాలు కూడా మోపిందన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఇప్పుడు మళ్లీ బుకాయించి మాపైనే ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇవన్నీ టీటీడీ బోర్డు ఛైర్మన్ కు తెలియకుండా జరుగుతాయా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆ సమయంలో ప్రసాదం తీసుకున్న ప్రతీ ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని వివరించారు.

# ఇక కేరళం...



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును "కేరళం"గా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును "కేరళం"గా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సంవత్సరం జరగనున్న కేరళం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ చర్య తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం (ఫిబ్రవరి 24, 2026)న ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం 'సేవా తీర్థ్'లో కేంద్ర మంత్రివర్గ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రాష్ట్ర పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ శాసనసభ జూన్ 24, 2024న ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మొదటి ప్రతిపాదనను సమీక్షించి, కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. దీంతో కేరళ శాసనసభ రెండవసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మేరకు ఇవాళ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో జాబితా చేసిన అన్ని భాషలలో దక్షిణాది రాష్ట్రం పేరును కేరళ నుండి "కేరళం"గా మార్చాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేరళ అసెంబ్లీ ఆగస్టు 2023లో ఇదే విధమైన ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే హోమ్ మంత్రిత్వ శాఖ కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, భారతీయ జనతా పార్టీ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తూ, రాష్ట్ర అధికారిక పేరును "కేరళ" నుండి "కేరళం" గా మార్చాలని డిమాండ్ చేశారు. "కేరళం" అనే పేరు మలయాళ భాషకు, రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపుకు లోతుగా అనుసంధానించబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# 14 ఏళ్లు దాటిన బాలికలకు..ఫ్రీ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్

దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది.ఆరోగ్య కేంద్రాల ద్వారా వీటిని పంపిణీ చేయనుంది. 14 ఏళ్లు దాటిన బాలికలకు ఈ టీకాకు ఉచితంగా వేయనున్నారు. నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్లను నివారించే సామర్థ్యం ఈ వ్యాక్సిన్‌కు ఉంటుందని ఆరోగ్యశాఖ చెబుతోంది. దీనిని బాలికలందరికీ అందించడం ద్వారా భవిష్యత్తుల్లో ఏ ఒక్కరూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా అడ్డుకోవచ్చు. ఆ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16,18, 6,11 రకాల నుంచి రక్షణ కల్పిస్తోంది. దీనిని హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్‌గా పిలుస్తారు.

2030 నాటికి నిర్మూలించే లక్ష్యం

2030 నాటికి భారత్‌లో మహిళలెవ్వరూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా దేశవ్యాప్తంగా భారీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారు. దీని వల్ల భారత్‌లో కేన్సర్ ముప్పు తగ్గుతుంది. 30 ఏళ్లలోపు మహిళలు ఈ టీకాను తీసుకోవడం వల్ల క్యాన్సర్ బారిన భవిష్యతులో పడే అవకాశం తక్కువగా ఉంటుందని అంతర్జాతీయ పరిశోధనల్లో వెల్లడైంది. ప్రస్తుతం దేశంలో తమిళనాడులో 14 ఏళ్ల బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించారు. దేశంలో బాలికలందరికీ వ్యాక్సిన్ అందించిన తొలి రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. ఇకతెలంగాణలో కూడా ఈ వ్యాక్సిన్ అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. తెలంగాణలో కూడా సర్వైకల్ క్యాన్సర్ బారిన ఎక్కువమంది పడుతున్నారు. దీంతో కట్టడి చేసేందుకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

పూర్తి రక్షణ ఒక డోసుతో

ఒక హెచ్‌పీవీ వ్యాక్సిన్ డోస్‌తో పూర్తి స్థాయిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బయటపడవచ్చని పరిశోధనల్లో తేలింది. దీంతో ఒక డోసు వేయించుకున్నా సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్న మహిళలకు సంబంధించి చైనా తొలి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత రెండో స్థానంలో ఉంది. ఇక మూడో స్థానంలో భారత్ కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఇండియాలో ఈ సంఖ్య 15 లక్షలుగా ఉంది. ఇక 2040 నాటికి 20 లక్షలకు చేరుకోవచ్చనే అంచనాలు ఉన్నాయి. దీంతో భవిష్యత్తులో భారత్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారి నుంచి మహిళలను కాపాడేందుకు కేంద్రం ఉచితంగా వ్యాక్సినేషన్ ఇవ్వాలని నిర్ణయించింది

# దాదాపు 4.35 కోట్ల మంది ప్రజలకు..



అమరావతి లక్ష్యం న్యూస్

రాష్ట్రంలో ఆహార భద్రత, రైతు సంక్షేమం, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం నుంచి సహకారం లభిస్తోందని పేర్కొన్నారు.మంగళవారం శాసనసభలో మాట్లాడుతూ రాష్ట్రంలో 29,796 ఫేర్ ప్రైస్ షాపుల ద్వారా సుమారు 1.48 కోట్ల రేషన్ కార్డుదారులకు సేవలు అందుతున్నాయి. దాదాపు 4.35 కోట్ల మంది ప్రజలకు ప్రతి నెల పౌర సరఫరా శాఖ ద్వారా నిత్యావసరాలు అందుతున్నాయని అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టి క్యూఆర్ కోడ్ ద్వారా సరఫరా వివరాల ట్రాకింగ్ సౌకర్యం కల్పించారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ రేషన్ డోర్ డెలివరీ సదుపాయం అమలు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదార, మిల్లెట్లు, గోధుమ పిండి తక్కువ ధరలకు అందజేత. పౌష్టికాహారానికి ప్రోత్సాహంగా రాగి, జొన్నల పంపిణీ ప్రారంభం. ఫోర్టిఫైడ్ గోధుమపిండి మార్కెట్ ధర ?70 ఉండగా ?20కే అందుబాటులో, దీపం-2" పథకం ద్వారా ఇప్పటివరకు 3.7 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ. ప్రతి ఏడాది అర్హ మహిళలకు 3 సిలిండర్లు సబ్సిడీతో అందజేత. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద ఫైన్ రైస్ సరఫరా. రైతుల నుంచి భారీ స్థాయిలో ధాన్యం సేకరణ; 24 గంటల్లో చెల్లింపులు అమలు. ధరల స్థిరీకరణకు ప్రైస్ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు, వినియోగదారుల హక్కులపై అవగాహన కోసం పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్బులు ఏర్పాటు. రేషన్ కార్డుల కోసం వాట్సాప్ ద్వారా దరఖాస్తు, వేగవంతమైన సేవలు అందుబాటులో. ప్రభుత్వం పారదర్శకతతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు
# కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- గంజాయి సాగును పూర్తిగా అరికట్టాము
- డ్రగ్స్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాము
- డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యుల పై కూడా దృష్టి పెట్టాం..మంత్రి అనిత

**అమరావతి, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్**

మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత ప్రకటించారు. ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణలను..శాసనమండలిలో మంత్రి అనిత తిప్పికొట్టారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని అనిత తెలిపారు. ఈ సంవత్సరం మహిళపై అత్యాచారాలు, హత్యలు నాలుగు శాతం తగ్గాయని చెప్పడానికి నేను చాలా గర్వంగా ఫీల్ అవుతున్నానని అన్నారు.చీణూ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపిందన్నారు. గంజాయి నిర్మూలనకు ఈగల్ అనే ఒక ప్రత్యేకమైన టాస్కోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. గంజాయి సాగును జీరో చేశామని అన్నారు. మదనపల్లి ఘటన చాలా బాధాకరమన్నారు. కానీ దారుణానికి ఒడిగట్టిన నేరస్థుడిపై ప్రభుత్వం వైపు నుంచి ఒత్తిడి పెరగడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నేరాలు చేసే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. మహిళా రక్షణ, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. పోక్సో కేసుల్లో శిక్షలు 15 శాతం




పెంచగలిగామన్నారు. 506 మందికి శిక్షలు పడితే.. అందులో 9 మందికి మరణ శిక్షలు పడ్డాయని,169 మందికి జీవితఖైదు పడిందని చెప్పారు.నేరస్థులకు బెయిల్ రాకముందే శిక్షలు వేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. చీఝ ప్రభుత్వం వచ్చేసరికి స్కూల్ పిల్లల బ్యాగుల్లోకి గంజాయి వెళ్ళిందని, ఇప్పుడు అదే స్కూల్ పిల్లలు రోడ్డు మీదకు వచ్చి గంజాయి వద్దు బ్రో- డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఒకానొక సందర్భంలో ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్,గంజాయి కు హాబ్ అని, ఈరోజు గంజాయిని ఎలా అరికట్టాలో ఆంధ్రప్రదేశ్ ను చూసి నేర్చుకునే పరిస్థితి అని చెప్పారు. అందరినీ వెతుకుతున్నాం, ఆఖరికి డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులకు పై కూడా దృష్టి పెట్టామన్నారు. 24 గంటల నుండి 48 గంటల లోపు ఏ నిందితునైన పట్టుకొని అరెస్టు చేస్తున్నామని హోం మంత్రి అనిత అన్నారు.

# ఏపీ పోలీసులకు చుక్కెదురు

విజయవాడ, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

సీనియర్ ఐపీఎస్, ప్రస్తుతం బిహార్ ఐజీ (ఫైర్ సర్వీసెస్)గా పనిచేస్తున్న ఎం. సునీల్ నాయక్ అరెస్టు చేసేందుకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఎదురుదెబ్బ తగిలింది. సునీల్ నాయక్‌ను ఏపీకి తరలించేందుకు అనుమతి (ట్రాన్సిట్ రిమాండ్) ఇవ్వాలని కోరుతూ ఏపీ పోలీసులు దాఖలు చేసిన దరఖాస్తును పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించింది. ఈ అరెస్టు ప్రక్రియలో ఏపీ పోలీసులు అనుసరించిన విధానంలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పట్నా కోర్టు పేర్కొంది. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. మరో 30 రోజుల పాటు ఐపీఎస్ సునీల్ నాయక్ పై అరెస్ట్ లాంటి ఎలాంటి చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందిఏపీ పోలీసుల తీరుపై పట్నా సివిల్ కోర్టు మండిపడినట్లు తెలుస్తోంది. ఎస్పీ దామోదర్ సహా దర్యాప్తు అధికారులు పాటించాల్సిన కనీస నిబంధనలను కూడా అనుసరించకుండా ఓ ఐపీఎస్ ఇంట్లోకి చొరబడటం ఏంటని ప్రశ్నించింది. సంబంధిత కేసు ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు.. కేసు డైరీ లేదు.

2

# రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కల్తీ పాల సంఘటనపై ఎంపి పురందరేశ్వరీ, పర్యటన

2

రాజమండ్రి లక్ష్యం న్యూస్

రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కల్తీ పాల సంఘటనపై ఎంపి పురందరేశ్వరీ, ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యటించారు. బాధితులతో మట్లాడి న్యాయం చేస్తమని హామీ ఇచ్చారు. కల్తీ పాలు సేవించి అనారోగ్యం పాలైన సంఘటనపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు జిల్లా అధికారుల తక్షణ స్పందన అభినందనీయమని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు మంగళవారం ఉదయం స్థానిక కిమ్స్ , రెయిన్బో , ఆదిత్య ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. ఎంపీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి, అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఎంపి మాట్లాడుతూ, కల్తీ పాలు సేవించి 15 మంది అనారోగ్యం పాలవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురు మరణించగా, మిగిలిన 11 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఇద్దరు చిన్నారులు ఉండటం మరింత విషాదకరమన్నారు. బాధితులకు అవసరమైన మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.వారి చికిత్స ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ అనే పాల వ్యాపారి వద్ద పాల శీతలీకరణ యంత్రం నుంచి ఇథిలిన్ గ్లైకోల్ అనే రసాయనం లీక్ కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణలో వెల్లడైందన్నారు. ఈ రసాయనం ప్రభావం ముఖ్యంగా 60 ఏళ్లు పైబడినవారికి, ఐదేళ్ల లోపు పిల్లలకు, అలాగే అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి ఎక్కువగా ఉంటుందని తెలిపారు .సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగం ఆయా ప్రాంతాలకు చేరుకుని బాధితులను ఆసుపత్రులకు తరలించడం, రక్త నమూనాలు సేకరించడం, 42 మంది రైతుల నుంచి పాల నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు

# సంపాదకీయం

## ఏటా 54 వేల కోట్ల రూపాయల దానం

దేశంలో దాతృత్వ కథలు సంపన్నులతో మొదలవుతాయి. ఆ తరువాతే సామాన్యుల వంతు.సంపన్నుల్లో కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత బడ్జెట్లు, బిలియనీర్లు ఇచ్చే కోట్ల రూపాయల వంటి ఆకర్షణీయ అంశాలు చాలా ఉన్నాయి.కానీ భారత్‌లో సామాన్యులు చేసే దానధర్మాలే ఎక్కువని ఓ నివేదిక చెబుతోంది.సంస్థాగత పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థలు దాతృత్వంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయనే సంప్రదాయ వాదనను 'హౌ ఇండియా గివ్స్ 2025 నివేదిక' సవాలు చేస్తోంది.దీన్ని అశోకా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ రూపొందించింది.దాతృత్వంలో పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థల కంటే ఎక్కువగా సాధారణ, మధ్య తరగతి వర్గం పెద్ద పాత్ర పోషిస్తున్నట్లు ఈ నివేదిక చెబుతోంది.భారత్‌లో గృహస్తులు ఏటా నగదుతో పాటు దుస్తులు, ఇతరత్రా వస్తువుల రూపంలో దాదాపు '54వేల కోట్ల రూపాయలు' స్వచ్ఛందంగా ఇస్తున్నారని ఈ నివేదిక అంచనా వేసింది.వారిలో 68 శాతం మంది ఏదో ఒక రూపంలో దానం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఇందులో 48 శాతం మంది ఆహారం, దుస్తులు లేదా ఇంట్లో వాడి పడేసిన వస్తువులు, 44 శాతం మంది నగదుగానూ, 30 శాతంమంది లాభాపేక్షలేని, మతపరమైన సంస్థలతో కలిసి అందించే స్వచ్ఛంద సేవ రూపంలో ఉంది.అన్నదానం కోసం ఇచ్చే విరాళాల్లో ఎక్కువ శాతం మతపరమైన ఉచిత అన్నదాన పథకాలకు వెళుతోంది. అలాగే ఈ సంస్థలు ప్రకృతివిపత్తులవేళ అందించే సాయంతోపాటు ఇతర పనులలోనూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయి."భారత్ ప్రజల్లో దాతృత్వగుణం ఎక్కువ. సంపన్నుల కంటే సాధారణ ప్రజలు విరాళాలు ఇవ్వడంలో, దాన ధర్మాలు చేయడంలో పెద్ద పాత్ర పోషిస్తున్నారని మా పరిశోధనలో తేలింది. దాతృత్వం దేశ ప్రజల్లో సాంస్కృతికంగా, విస్తృతంగా ఇమిడి పోయింది" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ హెడ్ జిన్నీ ఉప్పల్ చెప్పారు.భారతీయుల్లో ఉదారత్వం కేవలం సంపన్నుల్లోనే కాదు, మత విశ్వాసాలను పాటించే సమూహాలు, ప్రత్యక్షంగా అడిగే సాయాలు, ఆదాయంతో సంబంధం లేకుండా సాధారణ ప్రజలు చేసే దానాలతో ఇది ముడి పడి ఉంది.భారత్‌లోని 20 రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 7 వేల మంది అభిప్రాయాలు సేకరించి ఈ నివేదిక రూపొందించారు.ఈ విశ్లేషణ నేషనల్ శాంపిల్ సర్వే మీద ఆధారపడి ఉంది. రోజువారీ దాతల వివరాలను పొందుపరిచేందుకు ప్రభుత్వం భారీ స్థాయిలో గృహ వినియోగానికి సంబంధించి సర్వే నిర్వహిస్తుంది. దీన్ని నేషనల్ శాంపిల్ సర్వే చేపడుతుంది.ఈ సర్వేలో పాల్గొన్నవారు మూడు నెలల కాలంలో తాము ఎంత తరచుగా, ఎంత మొత్తం విరాళంగా ఇచ్చామో చెప్పారు.వార్షిక అంచనాలను రూపొందించేందుకు సర్వేలో సేకరించిన అంశాల ఆధారంగా నివేదికలో అంశాలను నిర్ధరించారు.ఈ సర్వే 'రోజువారీ దానాల'ను పరిశీలించింది. బిచ్చగాళ్లకు సాయం చేయడం, కుటుంబం లేదా స్నేహితులకు వ్యక్తిగతంగా సాయపడటం, సంస్థాగత, మతేతర సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఇందులో ఉన్నాయి.అంతే కాకుండా ఇది "విడిగా ఇవ్వడాన్ని" (రిటైల్ గివింగ్) కూడా పరీక్షించింది. రిటైల్ గివర్స్ అంటే సంపన్నులు కాకుండా, సాధారణ వ్యక్తులు లాభాపేక్ష లేని సంస్థలకు ఇచ్చే విరాళాలు. ఈ సర్వే దానానికి సంబంధించి విస్తృత పరిధిలో డేటాను సేకరించింది. అందులో వ్యక్తులకు నేరుగా సాయమందించడం, మత సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఉన్నాయి.సామీప్యత, విశ్వాసం అధారంగానే చాలా మంది దానాలు చేస్తున్నట్లు సర్వే గుర్తించింది.విరాళాలు ఇచ్చే వారిలో దాదాపు 40 నుంచి 45 శాతం మంది ప్రజలు మతపరమైన సంస్థలకు ఇస్తున్నారు.ఇందులో ఎక్కువ వాటా పట్టణ ప్రాంతాల్లోని బిచ్చగాళ్లు, నిరాశ్రయులకు వెళుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో మతపరమైన సంస్థలకు ఎక్కువ విరాళాలు అందుతున్నాయి."దానం చేయడానికి మిమ్మల్ని ప్రేరేపిస్తున్నది ఏంటని మేము అడిగినప్పుడు మతపరమైన విశ్వాసమే తమకు ప్రేరణ అని 90శాతం మందికి పైగా చెప్పారు" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రపీ పరిశోధన అధిపతి క్రిషాను చక్రవర్తి చెప్పారు.వ్యక్తిగతంగా వచ్చి నేరుగా అడగడం, ప్రచారం, ఇళ్ల వద్దకు విరాళాలు సేకరించేవారు, ప్రార్థనా స్థలాలు లేదా బహిరంగ ప్రదేశాలు ఏదైనా కావచ్చు ప్రజలు ఇలాంటి చోటనే విరాళాలు ఇస్తున్నారు. అంతే కానీ డిజిటల్ ప్రచారాలు లేదా విరాళాలు సేకరించే కార్యక్రమాలను పెద్దగా పట్టించుకోవడం లేదు.చదువుకు దాన గుణానికి పరస్పర సంబంధం ఉందని సర్వేలో తేలింది. రోజువారీ దాన ధర్మాలు చేసే వారిలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎక్కువ మంది ఉన్నారు.అయితే దాన ధర్మాలు చేయడం కేవలం సంపన్నులు, చదువుకున్న వాళ్లకే పరిమితం కాదు. నెలకు రూ.4వేల నుంచి రూ.5వేలు సంపాదించే వారిలోనూ సగం మంది దానం చేస్తున్నారు. వారి సంపాదన పెరిగే కొద్దీ దానాలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.ఇందులో లింగపరమైన అంశాలు చిన్నవే అయినా స్పష్టంగా ఉన్నాయి. మగాళ్ల పెత్తనం ఉన్న ఇళ్లలో కాస్త ఎక్కువగా మతపరమైన దానాలు చేస్తుంటే, మహిళల పెత్తనం ఉన్న ఇళ్లలో నిరుపేదలకు దానం చేయడం ఎక్కువగా ఉంది."ఈ సర్వేలో కీలకమైన అంశం ఏంటంటే భారతీయుల్లో రోజువారీ దానాలు చేయడం అనేది అప్పుడప్పుడు కాకుండా క్రమబద్ధంగా ఉంది" అని ఉప్పల్ చెప్పారు."ఇది ఆదాయం, వయసు, లింగం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అన్ని చోట్లా, అందరిలోనూ ఉంది. దైనందిన సామాజిక జీవితంలో కనిపిస్తూనే ఉంటుంది" అన్నారు.మరో ముఖ్య విషయం ఏంటంటే, భారత్‌లో మొత్తం దానధర్మాల్లో రోజూ దానం చేసే వారి వాటా 15శాతం వరకు ఉంటుందని అంచనాలు సూచిస్తున్నాయి.పదిహేను శాతమే అయినప్పటికీ వ్యవస్థీకృత సామాజిక రంగానికి అందుతున్న ప్రైవేట్ డొనేషన్లలో మూడోవంతుగా ఉంది."రోజూ దానం చేసే వాళ్లు ఇచ్చేది కొద్ది మొత్తమే అయినా, సామాజికంగా ప్రభావం చూపడంలో ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తోంది" అని ఉప్పల్ చెప్పారు.సర్వేలో ప్రజల నుంచి వచ్చిన సమాధానాలను వారి రోజువారీ ఖర్చులతో కలిపి చూసినప్పుడు, ప్రజలు ఖర్చు చేసే తీరుతెన్నులు దానధర్మాలు చేయడానికి ఎలా దోహద పడుతున్నాయో పరిశీలించారు.ఇంటి ఖర్చులు పెరిగే కొద్దీ, విరాళాలు ఇవ్వడం, దానం చేసే మొత్తం కూడా పెరుగుతున్నట్లు సర్వే గుర్తించింది."ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ కూడా ఒకటి. భారత జీడీపిలో ప్రజల వినిమయశక్తి ప్రధాన భాగం. గృహ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ, దాన ధర్మాలు, విరాళాలు పెరిగే అవకాశం ఉంది" అని ఉప్పల్ చెప్పారు.అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రజల రోజువారీ దాన ధర్మాలు, విరాళాలు ఎన్జీవోలకు వెన్నెముక లాంటివి.ఈ సర్వేను మత పరమైన వేడుకలు, పండుగలు తక్కువగా ఉండే మార్చ్- ఏప్రిల్ మధ్య నిర్వహించినట్లు ఉప్పల్ తెలిపారు."మతపరమైన సంస్థలకు ఇచ్చే వ్యక్తిగత విరాళాలు ఎక్కువగా ఉండటంతో మతపరమైన సందర్భాలు ఉన్న నెలల్లో ప్రజల్లో ఎక్కువ మంది విరాళాలు ఇస్తారని భావించవచ్చు" అని ఆమె అన్నారు.

## జార్ఖండ్ లో విమాన ప్రమాదం

రాయిపూర్ లక్ష్యం న్యూస్

టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఎయిర్ అంబులెన్స్ విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరి సిబ్బంది తో సహా ఏడుగురు మృతి చెందారు. ప్రమాదానికి గురైంది రెడ్ బర్డ్ ఎయిర్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన బీచ్ క్రాఫ్ట్ సి 90 విమానం గా గుర్తించారు. సాయంత్రం 7:11 నిమిషాలకు రాంచీ నుంచి ఢిల్లీ విమానం బయలుదేరింది. టేకాఫ్ అయిన తర్వాత కోల్కతా కమ్యూనికేషన్ సెంటర్ తో ఎయిర్ అంబులెన్స్ సిబ్బంది మాట్లాడారు. వాతావరణ కారణాల వల్ల దిశను మార్చాలని కోరారు. 7:34 నిమిషాలకు కమ్యూనికేషన్ సెంటర్ తో సంబంధం తెగిపోయింది.

## ఎం బి యు ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి లక్ష్యం న్యూస్

మోహన్ బాబు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. చంద్రగిరి మండలం, రంగంపేటలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్లో ఘటన జరిగింది. మృతురాలు పుంగనూరు నియోజకవర్గం లోని మంగళం కు చెందిన విద్యార్థి భువన. మోహన్ బాబు యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఫైనల్ ఇయర్ బీటెక్ చదువుతోంది. విషయం తెలుసుకున్న చంద్రగిరి పోలీసులు మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ అన్నారు.

## ఏసీబీ వలలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్! ?

పశ్చిమ గోదావరి :లక్ష్యం న్యూస్

అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు మరోసారి విరుచుకుపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీగా లంచం తీసుకుంటూ అటవీ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.?భీమవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సురేష్, ఒక పని నిమిత్తం బాధితుడి నుంచి 4 లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించింది.

**రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ :**

సురేష్ తన కార్యాలయంలో బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు.?నగదు స్వాధీనం: నిందితుడి వద్ద నుంచి రూ. 4 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.? తనిఖీలు : ప్రస్తుతం సురేష్ కార్యాలయం మరియు నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.?"అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు" అని ఏసీబీ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## చట్ట సభల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి

**- జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు**

**మంత్రి నాదెండ్ల సూచన**

అమరావతి లక్ష్యం న్యూస్

క్షేత్ర స్థాయి ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పనిచేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. శాసనసభ, మండలిలో జరుగుతున్న తీరు, పార్టీ ప్రజాప్రతినిధులు అడుగుతున్న ప్రశ్నలు, పాల్గొంటున్న చర్చలు, చట్టసభల్లో అనుసరించబోయే వ్యూహం గురించి సోమవారం అసెంబ్లీలోని జనసేన పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలో మనోహర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రసార మాధ్యమాల్లో మాట్లాడే సమయంలో పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూనే? వైసీపీ కులాల మధ్య పెడుతున్న చిచ్చుల కుట్రలను ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విలువైన చట్టసభల సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికతో సభకు రావాలని చెప్పారు. ప్రజా సమస్యలను, ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాల నిర్వహణకు తగినంత సమయం కేటాయించాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకి సమాయత్తం కావాల్సిన సమయం వచ్చిందని చెప్పారు.

## రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో కల్తీ పాల సంఘటనపై ఎంపి పురందరేశ్వరీ, పర్యటన

**(మొదటిపేజీ తరువాయి )**

పంపించడం వంటి చర్యలను ఆమె ప్రశంసించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం బాధ్యత తీసుకుని బాధితుల వైద్య ఖర్చును పూర్తిగా భరిస్తోందన్నారు. అధికారులతో పాటు కూటమి నాయకులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు.రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, పాలు వినియోగించిన 293 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, ఇప్పటివరకు 241 మందికి వచ్చిన నివేదికలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. మూల కారణాలను గుర్తించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సంబంధిత వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని ఇతర డెయిరీలపై నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే పాలు, ఇతర ఆహార పదార్థాల కల్తీపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేయడంతో పాటు, పూర్తిస్థాయి ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు.

## నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి


**(మొదటిపేజీ తరువాయి )**

**టీటీడీని'అన్యమతస్తులతో నింపేశారు**

ఎవరికి ఏ బాధ వచ్చినా శ్రీ వేంకటేశ్వరస్వామిని మొక్కుకుని ఆయనతో చెప్పుకుంటామని.. 2019-24 మధ్య స్వామి వారికి జరిగిన అపచారం పట్ల తీవ్ర ఆవేదన చెందామని అన్నారు. శ్రీవారి ఆలయంలో అన్యాయం జరుగుతోందని, రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని పోరాడితే కేసులు పెట్టి వేధించారని శాసనసభలో సీఎం వివరించారు. రామతీర్థంలో రాముడి తల నరికారని అక్కడికి వెళ్తే తన పైనా కేసులు పెట్టారని తెలిపారు. బ్రిటీషర్లు కూడా తమ పాలనలో తిరుమల శ్రీవారి జోలికి వెళ్లలేదని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. సామాన్య భక్తులు ఏడు కొండలవాడా గోవిందా అనే నామాన్ని స్మరిస్తూ తిరుమలకు వెళ్తారని అలాంటి ఏడు కొండలను రెండు కొండలకు కుదిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దాడి మొదలెట్టారని అన్నారు. ఈ నిర్ణయంపై రెండేళ్ల పాటు దేశంలోని హిందువులంతా తీవ్ర ఆందోళనలు చేయటంతో ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారని అన్నారు. ఈ అంశంపై పోరాటం చేసిన తనపైనా ఆరోపణలు, ఫేక్ ప్రచారం చేశారని ముఖ్యమంత్రి వివరించారు. ఉడిపి పెజోవర్ మఠాధిపతి విశ్వేశ్వర తీర్థ స్వామిజీ ఆదేశం మేరకు ఏర్పాటు అయిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తిరుమలలో అన్యమత జోక్యంపై నివేదిక ఇచ్చిందన్నారు. తిరుమలతో పాటు అక్కడి విద్యా సంస్థల్లో అన్యమత ప్రచారం జరింగిందని, ఉద్యోగులు, దుకాణాల్లోనూ అన్యమతస్తులు ఉన్నట్టుగా తేల్చిందని వివరించారు. గతంలో తిరుమల స్పెసిఫైడ్ అథారిటి అధ్యక్షుడిగానూ క్రైస్తవుడైన అధికారిని తప్పించాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదిక ఇచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ, పద్మావతి విశ్వవిద్యాలయాలకు కూడా వీసీలుగా క్రిస్టియన్లనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి నియమించారని పేర్కొన్నారు. వారి హయాంలో బలవంతపు మత మార్పిడులు కూడా జరిగాయని ఆరోపణలు వచ్చినట్టు వివరించారు. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సు టికెట్లపైనా జెరుసలేం యాత్రకు వెళ్లాలంటూ అన్యమత ప్రచారం చేశారన్నారు. టీటీడీ ప్రతిష్ఠ దిగజార్చేలా గత పాలకులు వ్యవహరించారని.. అన్యమతస్తులైన ఛైర్మన్లను నియమించారన్నారు. నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి క్రిస్టియన్ గా బైబిల్ పట్టుకుని తిరిగారని ఆరోపించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ భూమన కుమార్తెకు మెదక్ చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి వారిని ఛైర్మన్లుగా ఎలా నియమిస్తారని సీఎం ప్రశ్నించారు. గత పాలకుల హయాంలో టీటీడీ వెబ్ సైట్ లో ఏసు ప్రభువు ఫోటో, శిలువ కూడా వచ్చేసిందని అన్నారు. దీనిపై పత్రికల్లో రాస్తే... ఆ పత్రికల్ని బెదిరించటానికి వంద కోట్ల డిఫమేషన్ వేయించారని అన్నారు.

**తిరుమల అంటే గత పాలకులకు చులకన**

లేని పింక్ డైమండ్ చోరీ అంటూ గతంలో తనపై దుష్ప్రచారం కూడా చేశారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. శ్రీవారిని అప్రతిష్టపాలు చేసే కుట్రకు ఇది మరో ఉదాహరణ అని అన్నారు. జంబో పాలక మండలి నియామకంతో



రాజకీయ పునరావాసంగా టీటీడీని మార్చేశారని సీఎం అన్నారు. హైకోర్టు తప్పు పట్టటంతో గత పాలకులు ఆ జీవోను వెనక్కు తీసుకున్నారని తెలిపారు. పరకామణిలో చోరీ జరిగితే దానిని కూడా సెటిల్ చేసేందుకు రాజీ ప్రయత్నాలతో పాటు చోరీని సమర్థిస్తూ చులకనగా గత పాలకులు మాట్లాడారని వివరించారు. దేవదేవుడి హుండీలో చోరీ జరిగితే ఇంత చులకనగా మాట్లాడతారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తిరుమల క్షేత్రానికి వెళ్లిన ఎవరైనా అక్కడ నిర్దేశించిన ఆచార సంప్రదాయాలను పాటిస్తారని... శ్రీవారి ఆలయానికి వెళ్లి డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయకుండా గత పాలకుడు ధిక్కరించారని అన్నారు. డిక్లరేషన్ పై క్యాన్సిల్ అని నమోదు చేసి దౌర్జన్యం ప్రదర్శించారని ఆక్షేపించారు. అధికారం ఉంది కదా అని అహంభావంతో ప్రవర్తించారని ఆక్షేపించారు. 2019-24 మధ్య ప్రణాళికా బద్ధంగా హిందూమతంపై దాడి జరిగిందని ఆరోపించారు. మొత్తం 2032 దేవాలయాలపై దాడి జరిగిందని...విగ్రహాలను ధ్వంసం చేశారని వేటిపైనా కేసు పెట్టి సరైన విచారణ చేయలేదన్నారు. రామతీర్థం, అంతర్వేది రథం, దుర్గగుడి వెండి సింహాల చోరీ లాంటి ఘటనలు చాలా జరిగినా నిందితులపై ఎలాంటి చర్యలూ లేవన్నారు. కూటమి హయాంలో దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. తిరుమలలో జరిగిన ఈ వ్యవహారాలపై హిందూ మఠాలు, పీఠాధిపతుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చాయన్నారు.

**కూటమి వచ్చాకే టీటీడీ ప్రక్షాళన**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే టీటీడీలో ప్రక్షాళనా చర్యలు మొదలు పెట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాద నాణ్యతను పెంచామని... ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ధృవీకరణ తర్వాతే లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.

భక్తులకు వడ్డించే అన్న ప్రసాద పాత దిట్టాన్ని తిరిగి అమల్లోకి తీసుకువచ్చామని... నాణ్యత, రుచి కూడా పెరిగాయని.. 98 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని సీఎం శాసనసభలో వివరించారు. పీఏసీ 5 వెంకటాద్రి నిలయం వద్ద ఆధునిక వసతులతో వంటశాల అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. భక్తులకు కేటాయించే గదులు, కాటేజీలను కేంద్రీకృతం చేసి దర్శనాలతో అనుసంధానించామని వివరించారు. బ్రేక్ దర్శనాలను కూడా నియంత్రించి సాధారణ భక్తుల దర్శన సమయం పెంచామన్నారు. రద్దీ నియంత్రణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ ఈ క్యూ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేస్తామని చెప్పారు. దేశీయంగా 200 దేవాలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టామని తెలిపారు. వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాలు, రథసప్తమి లాంటి పర్వదినాల్లో తరలివచ్చిన లక్షల మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 60 టీటీడీ దేవాలయాల్లో రూ.700కోట్లతో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తిరుమలలో గ్రీన్ కవర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని 3.5 ఎకరాల్లో దివ్య ఔషధ వనం ప్రాజెక్టు కూడా త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. అన్నదాన, ప్రాణదాన కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. శ్రీవారి సేవకుల కార్యక్రమం ద్వారా వైద్యులు కూడా సేవలందించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 5 వేల దేవాలయాలను నిర్మించేలా కార్యాచరణ చేపట్టామని తెలిపారు.

**హెరిటేజ్ నీతి నిజాయితీతో నిలబడింది**

కుటుంబ వ్యాపార సంస్థగా ఉన్న హెరిటేజ్ ప్రభుత్వంతో ఎక్కడా ఒప్పందాలు చేసుకుని ఉత్పత్తులు విక్రయించలేదని సీఎం స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వ శాఖ హెరిటేజ్ నుంచి ఒక్క కిలో నెయ్యి కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండానే నీతి నిజాయితీతో హెరిటేజ్ నిలబడిందని శాసనసభలో వివరించారు. అయినా సాక్షి పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు రాశారన్నారు. నేరస్తులు ఏ విధంగా సంస్థల క్రెడిబిలిటీని దెబ్బతీస్తారు అనటానికి ఈ రాతలే పెద్ద ఉదాహరణ అన్నారు. గత పాలనలో భారతీ సిమెంట్స్ నుంచి హౌసింగ్ పథకాలు, ప్రాజెక్టుల్లో సిమెంట్ కొనుగోలు చేశారని దీనిపై తామేమి మాట్లాడ లేదని అన్నారు. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని సీఎం ఆక్షేపించారు. రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరించి విక్రయిస్తున్న హెరిటేజ్ నీతి నిజాయితీతో వ్యాపారం చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ కు నెయ్యి విషయంలో అసలు సంబంధమే లేదని వివరించారు. పూణేలో ఉన్న ఇందాపూర్ డెయిరీ ప్రసిద్ధ కంపెనీలన్నిటికీ కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. మదర్ డెయిరీ, బ్రిటానియా, ఆయుర్వేద ఘీ పతంజలి, డిమార్ట్, రిలయన్స్, దొడ్ల, హాట్సన్ , జీఆర్బీ, అముల్, హెరిటేజ్ ప్రముఖ సంస్థలకు ఉత్పత్తుల కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో పాల కల్తీ ఘటన జరిగితే దానిపై చర్చించకుండా మండలిలో అడ్డుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఘటనపై చర్చించి తగిన చర్యలు చేపట్టిందని తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల్ని ఒప్పుకోవాలని... దేవాలయాల పవిత్రతను దెబ్బ తీయవద్దని సీఎం హితవు పలికారు. తప్పుచేసిన వ్యక్తులే తమను క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైందవ ధర్మంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానన్నారు. వేర్వేరు మతాలకు చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే అధికారం మరొకరికి లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## ఏపీ పోలీసులకు చుక్కెదురు

**(మొదటిపేజీ తరువాయి )**

స్థానిక కోర్టు నుంచి ఎలాంటి వారెంట్ లేకుంటే సామాన్యుడ్ని కూడా అరెస్ట్ చేయలేరు. ఒక ఐపీఎస్ అధికారిని అరెస్టు చేయడానికి రూల్స్ పాటించరా అని పట్నా సివిల్ కోర్టు ప్రశ్నించింది. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు వివరాలను కోర్టుకు అందజేసి బిహార్ ఐజీ సునీల్ నాయక్ అరెస్టు చేస్తామని.. ట్రాన్సిట్ వారెంట్ జారీ చేయాలని కోరగా కోర్టు అందుకు అనుమతించలేదు. బాధ్యత గత అధికారి విషయంలో ఏపీ పోలీసులు, దర్యాప్తు టీం ఎలాంటి రూల్స్ పాటించకపోవడం, సీనియర్ ఐపీఎస్ పట్ల దురుసుగా వ్యవహరించారని కోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా ఏపీ పోలీసుల వద్ద సరైన అరెస్ట్ వారెంట్ లేకపోవడం, కేస్ డైరీని అప్‌డేట్ చేయకపోవడంతో పాటు స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని కోర్టు పేర్కొంది. కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా అరెస్టు ప్రక్రియ ఉండరాదని పేర్కొంటూ పట్నా సివిల్ కోర్టు ఐపీఎస్ సునీల్ నాయక్ ట్రాన్సిట్ రిమాండ్‌ను రిజెక్ట్ చేసింది. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు (అప్పటి నరసాపురం ఎంపీ) 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజద్రోహం కేసులో రఘురామకృష్ణరాజును సీఐడీ అరెస్ట్ చేసింది. ఆ సమయంలో కస్టడీలో ఉండగా తనను కొట్టారని, ఈ కుట్రలో పలువురు ఉన్నతాధికారుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. తనను పోలీస్ కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని, తనపై హత్యాయత్నం జరిగిందని 2024లో గుంటూరులో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నారు. కేసు విచారణ పూర్తయ్యేవరకు, లేదా రిటైర్మెంట్ ఏది ముందుగా వస్తే అప్పటివరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఏపీ సీఐడీలో డీఐజీగా పనిచేస్తున్న ఐపీఎస్ సునీల్ నాయక్ ఈ కేసులో ఀ7గా ఉన్నారు. ఈ కేసులో కేవలం సునీల్ నాయక్ మాత్రమే కాకుండా, అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్, మాజీ ఏజీ, తదితరులపై కూడా ఆరోపణలు ఉన్నాయి.ఒక రాష్ట్రంలో అరెస్ట్ చేసిన వ్యక్తిని మరో రాష్ట్రంలోని సంబంధిత కోర్టుకు తరలించడానికి స్థానిక కోర్టు నుంచి అనుమతి పొందే ప్రక్రియను 'ట్రాన్సిట్ రిమాండ్' అంటారు. అయితే కేసుకు సంబంధించి పూర్తి వివరాలు, కేసు తీవ్రతను తెలిపే విషయాలు కోర్టుకు సమర్పిస్తే ట్రాన్సిట్ వారెంట్ కు అనుమతి లభిస్తుంది. అయితే సరైన ఆధారాలు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కోర్టులు ట్రాన్సిట్ రిమాండ్ తిరస్కరిస్తుంటాయి. బిహార్ ఐజీ సునీల్ నాయక్ విషయంలో ఇదే జరిగింది. బిహార్ లో అరెస్ట్ చేసి ఏపీకి తరలించి కోర్టులో హాజరుపరచాలని భావించిన పోలీసులకు ఎదురుదెబ్బ తగిలింది.

## ఉద్దేశపూర్వకంగా నన్ను ఇరికించారు

## ఐపీఎస్ సునీల్ నాయక్

విజయవాడ లక్ష్యం న్యూస్

రఘురామకృష్ణంరాజు కేసులో నిందితుడుగా వున్న ఐపిఎస్ అధికారి సునీల్ నాయక్ ఎక్స్ లో సంచలన పోస్ట్ చేసారు. నేను ఎస్టీగా పుట్టడమే నేరమా? ఉన్నత ఉద్యోగాల్లో చిన్నకులాలవారు ఉంటే జీర్ణించుకోలేరా? రఘురామ కేసులో ఉద్దేశపూర్వకంగా నన్ను ఇరికించారని ఆరోపించారు. 2021లో జరిగిన ఘటన ఇది.. 2024లో ఎఫ్ఐఆర్ లో నా పేరు లేదు. నా పాత్ర లేకున్నా నన్ను నిందితుడిగా కేసులో చేర్చారు. ఫిర్యాదుదారుడు నాకు కాల్ చేశాడు. మాజీ సీఎం జగన్ మీద, పీవీ సునీల్ కుమార్ మీద చెప్పాలనీ..లేకుంటే కేసులో నేరస్తుడివి అవుతావని బెదిరించాడు. రఘురామ కాలేటా బయటకు తీస్తే..ఈ కేసులో ఎంతమందిని ప్రభావితం చేశారో తెలుస్తుంది. సరైన సమయంలో ఆధారాలు బయటపెడతా నని పేర్కొన్నారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
బుధవారం 25-2-2026


## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**గుంటూరు, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం గుంటూరు ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు. పరీక్షా కేంద్రంలో కనీస అవసరాలైన తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనుటకు బస్ సౌకర్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షల సమయంలో చుట్టుప్రక్కల జెరాక్స్ మెషిన్ దుకాణాలు మూసివేయడం అంశాలను గురించి వాకబు చేశారు. పరీక్షల సమయంలో అనవసరపు వదంతులకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టడం జరిగిందని చెప్పారు. కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేశారు. ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత మాట్లాడుతూ రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఉంటాయని చెప్పారు. జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మొత్తం 68,898 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని తెలిపారు.

# 10 గ్రామాలలో వేగంగా రీ సర్వే - కలెక్టర్

**బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
బాపట్ల జిల్లాలోని 10 గ్రామాలలో రీ సర్వే ప్రక్రియ సాగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. 6,400 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,287 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. మంగళవారం రెవెన్యూ, తదితర అంశాలపై రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో ఉప తహసిల్దార్, సర్వేయర్ల డిప్యూటేషన్ రద్దు చేయాలన్నారు. రీ సర్వే జరిగే గ్రామాలలోని సర్వేయర్లు తప్పనిసరిగా సంబంధిత గ్రామంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం పంపిణీ ప్రక్రియ వేగంగా చేపట్టాలనీ,ఐ వి ఆర్ ఎస్ లో అధిక శాతం సాధించేలా ప్రభుత్వ సేవలు ఉండాలన్నారు. ప్రజలకు మేలు



జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వివరణ ఇస్తూ బాపట్ల జిల్లాలో 10 గ్రామాలలో రీ సర్వే సాగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. 6,400 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,287 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన పట్టాదారు పాసు పుస్తకాలు తక్షణమే అర్హులైన ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. పట్టాదారు పాసు



పుస్తకాల పంపిణీ, ఈకేవైసీ ప్రక్రియ 68.32 శాతానికి చేరిందన్నారు. బాపట్ల జిల్లా రాష్ట్రంలోని 5వ స్థానంలో నిలిచిందన్నారు.సమావేశంలో సి సి ఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, భూములు రికార్డుల శాఖ ఏడి శేషగిరిరావు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో చీరాల విద్యార్థులు



**చీరాల ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను వీక్షించేందుకు బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం ఎన్ ఆర్ అండ్ పిఎం హైస్కూల్ విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు. ఇలా విద్యార్థులు అసెంబ్లీని సందర్శించడం ఆనందంగా ఉందని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపాధ్యాయులుతో పాటుగా విద్యార్థులను కలుసుకుని ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం అత్యంత అవసరమని వారికి



సూచించాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు ఎలా పనిచేస్తాయి, ప్రజల సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి అనే అంశాలను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాభావం, ప్రజాసేవా స్ఫూర్తి మరింత బలపడుతుందని స్పష్టంగా తెలియజేశారు. యువతే దేశ భవిష్యత్తు అని, ఉన్నత లక్ష్యాలతో క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు హైమావతి, జై చంద్రలు పర్యవేక్షించారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం



**తెనాలి ఫిబ్రవరి 25(లక్ష్యం న్యూస్)**
శ్రీ వెంకటేశ్వర యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో యోగ సభ్యుల తల్లిదండ్రులైన కన్నెగంటి పిచ్చయ్య సుశీలాదేవి 55వ వివాహ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా కుమారులు కన్నెగంటి నరేంద్ర కుమార్,వెంకట నందకిషోర్ ల సహకారంతోమంగళవారం షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో నిరుపేదవృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమము ఎస్. వి.యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పర్యవేక్షణలో నిర్వహించారు.

# అగ్రకుల భావజాలం సుబ్బారావు తొలగించుకోవాలి

**చీరాల ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
అగ్రకుల భావజాలం సుబ్బారావుకు ఉంటే తక్షణమే తొలగించుకోవాలని చీరాల జనసేన నాయకులు దళిత నాయకులు గొల్లపూడి సుబ్బారావుకి హితవు పలికారు. వారు మాట్లాడుతూ

ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రాజకీయాలలో ఎంపీ గా బాపట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ను బహిరంగ సభలో రాజకీయాలు నేర్చుకోవాలని చెబుతున్న గొల్లపూడి సుబ్బారావు నీ స్తాయి ఏమిటో తెలుసుకోవాలన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి జి యస్ ప్రసాద్ అన్నారు.

ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ను బహిరంగ సభలో రాజకీయాలు నేర్చుకోవాలన్న గొల్లపూడి సుబ్బారావు వ్యాఖ్యలు ఖండిస్తూ దళిత నాయకులు చీరాల జనసమితి కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రావినూతల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వేగంగా బాపట్ల ఎంపీ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుండగా

అగ్రకుల భావజాలంతో సుబ్బారావుకు అనుచిత వ్యాఖ్యలు తక్షణమే తొలగించుకోవాలనీ, ముందుగా మీరు పబ్లిక్



మీటింగ్ లో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని హితవు పలికారు. తెన్నేటి కృష్ణ ప్రసాద్ దళిత ఎంపీ అనే వివక్ష తో మాట్లాడారా లేదంటే అనుకోకుండా పదాలు దొర్లాయా అనేది తెలియరాలేదని ఏదేమైనా మా ఎంపీని రాజకీయాలు నేర్చుకోవాలని బహిరంగ సభలో అనడం దళితులుగా మా మనోభావాలు దెబ్బతిన్నాయని తక్షణమే గొల్లపూడి సుబ్బారావు వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలలో హుందాగా ఉండాలని చేసిన తప్పుకు క్షమాపణ చెప్పాలని రాష్ట్రంలో అత్యున్నత స్థాయి పోలీస్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన వ్యక్తిన నీవు రాజకీయాలు నేర్చుకోమనే ముందు నీ స్థాయి ఏమిటో తెలుసుకొని మాట్లాడాలన్నారు. సదరు సుబ్బారావు మా ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తో పాటుగా యావత్ దళిత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు దుడ్డు జోసఫ్,రాంబాబు, యేసోబు,బిసి నాయకులు నగేష్,పొందుగల శ్యామ్, ఐ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో.. వీధి దీపాలు - జనసేన



### - ప్రజా శ్రేయస్సే పార్టీ ఆశయం

**కొండెపి ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
ప్రజల శ్రేయస్సే పరమావధిగా జనసేన పార్టీ పనిచేస్తుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రక్షాన జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ క్రమంలో సింగరాయకొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్ ఆధ్వర్యంలో సింగరాయకొండ పంచాయతీ పరిధిలో, కొల్లూరి వారి వీధి లో జనసేన నాయకులు టీమ్ 99 సభ్యులు సమయం రాజేంద్ర సాయి సొంత డబ్బులతో వీధి దీపాలు వేయించటం పార్టీ ఆశయ సాధనకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ మండల ప్రధాన కార్యదర్శి కాసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువలో గల్లంతు - మృతదేహాలు లభ్యం




**బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
బాపట్ల అప్పికట్ల రోడ్డులోని యారకాలువలో ఈతకు వెళ్లి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కాగా సోమవారం సాయంత్రం ఈత పోటీకి దిగిన పీటా లీలావంశీకృష్ణ, చందు అనే ఇద్దరు స్నేహితులు నీటిలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అధికారుల గాలింపు చర్యల అనంతరం వంశీ, చందుల మృతదేహాలు బయటపడటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. చేతికి అంది వచ్చిన బిడ్డలు అకాల మృతి వాతపడటం ఆ కుటుంబాలను శోకసముద్రంలో ముంచింది. కాగా ఇరువురి యువకులు మద్యం మత్తులోనే కాలువలో ఈత పోటీలకు దిగారని స్థానికులు చెప్పుకుంటున్నారు.

# అర్జీదారులు... స్వయం పరిశీలన - కలెక్టర్







**(చిన్నగంజాం) బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:**
నివేశన స్థలాలకై దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వద్దకే నేరుగా వెళ్లి వారి స్థితిగతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వివరాల్లోకి వెళితే చినగంజాం మండలం,గొనసపూడి గ్రామంలో ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల స్థితిగతులను మంగళవారం కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. గొనసపూడి గ్రామంలో ఇండ్ల స్థలాల కోసం 12 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తు దారులలో మెడబలిమి దానమ్మ, భర్త బోసు బాబు వారి స్థితిగతుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఏ విధంగా చేసుకున్నారు, ఎవరికి చేసుకున్నారు, ఎక్కడ చేశారు అని ఆన్లైన్ దరఖాస్తు ఆధారంగా వారి వివరాలను ఆయన అడిగారు. దానమ్మ తనకు భర్త లేదని, ఉండడానికి నివాసం లేదని, తన మామ ఇంట్లో తలదాచుకుంటున్నానని, ఆమెకు ఎటువంటి ఆస్తిపాస్తులు లేవని, అందుకు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నానని ఆమె కలెక్టర్ కు తెలిపారు. ఇండ్ల స్థలాల కోసం గొనసపూడి గ్రామంలో దరఖాస్తు చేసుకున్న 12 మందికి ఒక్కొక్కరికి 3 సెంట్లు చొప్పున ఎల్.పి.ఎం. సంఖ్య. 1179 లోని 36 సెంట్లు ఖాళీ ప్లాట్ లను కలెక్టర్ పరిశీలించారు. ఆ స్థలంలో ప్లాట్లు ఖాళీగా ఉండుటకు గల కారణాలను ఆర్డిఓ ను అడిగి తెలుసుకున్నారు. చీరాల డివిజన్లో ఇళ్ల స్థలాల ధరఖాస్తుల విషయమై ఆర్డిఓను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, చినగంజాం తహసిల్దార్ జె.ప్రభాకర రావు, వీఆర్వో నాగరాజు తదితరులు ఉన్నారు.

# యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు జిల్లా కలెక్టర్..



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్**
జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం కలెక్టరేట్ లోని చాంబర్ నందు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో వచ్చే ఖరీఫ్ కు రైతులకు అవసరమైన యూరియా నిల్వలు తదితర అంశాలపై సమీక్షించారు.

## రాష్ట్రంలో పశువైద్య వ్యవస్థను బలోపేతం చేయాలి - మండలానికి ఒక పశువైద్యశాల ఏర్పాటు చేయాలి : విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశు అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేయాలి : యార్లగడ్డ**
**వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలి : యార్లగడ్డ**
అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పశుసంవర్ధక శాఖ పనితీరు పశువుల సంరక్షణపై సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలో వెటర్నరీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, బ్రిటిష్ కాలంలో బాగున్న ఈ వ్యవస్థ కాలక్రమేణా ప్రాధాన్యతలు మారి బలహీనపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కేవలం గోపాల మిత్రలు, పారామెడికల్ టీమ్‌లతోనే వ్యవస్థ నడుస్తోందని పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక పశువైద్యశాలను ఏర్పాటు చేసి, తగినంత మంది డాక్టర్లను నియమించకపోతే భవిష్యత్తులో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గన్నవరం ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ భవన ప్రహరీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు అది మన రాష్ట్ర పరువు తీసేలా ఉందని విమర్శించారు. గత సమావేశాల్లో మంత్రి హామీ ఇచ్చినట్లుగా, వెంటనే నిధులు కేటాయించి ఆ ఆసుపత్రిని ఆధునీకరించాలని కోరారు. 2019-24 మధ్య కాలంలో పశుసంవర్ధక శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఆ సమయంలో స్థానిక నేతలు, కొందరు అధికారులు మరియు పోలీసుల అండతో ఒంగోలు గిత్తలు, ఆవులను అక్రమంగా కలకత్తా మీదుగా బంగ్లాదేశ్‌కు తరలించారని ఆరోపించారు. లక్షలాది రూపాయల విలువైన పశువులను తక్కువ ధరకే కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడ్డారని, దీనివల్ల రాష్ట్రంలో పశుసంపద తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే చెక్ పోస్టులను బలోపేతం చేసి, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని, వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలని యార్లగడ్డ వెంకట్రావు సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలి





**- కెయూ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ**
**- లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్**

**కృష్ణా విశ్వవిద్యాలయం ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:** విద్యార్థులు, యువత వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పిలుపునిచ్చారు. మంగళవారం సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఏర్పాటుచేసిన లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 789 ఫార్ములాను పాటించాలని, ఏడు గంటల నిద్ర, ఎనిమిది గంటల చదువు, తొమ్మిది గంటల ఇతర వ్యాపకాలు కోసం కేటాయించాలని సూచించారు.

రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ గొప్పదనాన్ని విదేశాల్లో చాటిన వివేకానందుని స్ఫూర్తి తో ముందుకు సాగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆంజనేయ కుమార్, సౌభాగ్యలక్ష్మి, సాయికృష్ణ చైతన్య తదితరులు ప్రసంగించారు.

అనంతరం లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్ పై జిల్లా సత్యసాయి సేవా సంస్థ ల అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్ తనదైన శైలిలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా



అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**చీరాల/ బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్:** విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, ఫోక్సో చట్టం, సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన కార్యక్రమం చీరాల కొత్తపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు టూ టౌన్ ఎస్ఐ రాంబాబు, శక్తి టీం సభ్యులు విహెచ్. సునీత బి.ధనలక్ష్మి, కళ్యాణిలు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నటువంటి మైనర్ డ్రైవింగ్ తో వాటిల్లే నష్టాలు అలాగే హెల్మెట్ పెట్టుకోకపోతే జరిగే ప్రమాదాలు, సైబర్ క్రైమ్స్, ఫోక్సో చట్టాల గురించి తెలియపరచారు. వ్యక్తులని నమ్మి ఎక్కడికి వెళ్ళకూడదని సెల్ ఫోన్లు వాడకూడదనీ, గంజాయి తదితర డ్రగ్స్ వలన జరిగే హానీ గురించి పిల్లలకి తెలియజెప్పారు. అలాగే విద్యార్థులకు మంచి ప్రవర్తన గురించి తెలియపరచి మంచి నడవడికతో మెలగాలనీ ఉపాధ్యాయుల మాటలు వినాలనీ



ఉపాధ్యాయులను గౌరవించాలని తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతలు కలిగి ఉండాలని హిత బోధ చేశారు. అలాగే శక్తి యాప్ గురించి చెప్పి, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నెంబర్ 112, ఇంకా ముఖ్యమైన హెల్ప్ లైన్ నెంబర్స్ గురించి తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో శక్తి యాప్ ని ఏ విధంగా



ఉపయోగించుకోవాలో వివరించారు. అలాగే ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినప్పుడు శక్తి టీం వారికి సమాచారం అందించి తగిన సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులతో పాటు ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధి ప్రదాత ప్రత్తిపాటి - మున్సిపల్ చైర్మన్ రఫాని

**- చిలకలూరిపేట కు ప్రత్తిపాటి పుల్లారావు నాయకత్వం ఒక వరం.**

**- అభివృద్ధి కాముకుడైన నాయకుడు ప్రత్తిపాటి వెంటే నా జీవితాంతం నడుస్తా.**

**చిలకలూరిపేట,ఫిబ్రవరి - 24 (లక్ష్యం న్యూస్)** పట్టణాన్ని ప్రత్యేక శ్రేణి పురపాలక సంఘంగా తీర్చిదిద్దడంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేసిన కృషి వెలకట్టలేనిదని మున్సిపల్ చైర్మన్ రఫాని కొనియాడారు. పట్టణ అభివృద్ధిపై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్లే నేడు చిలకలూరిపేట ముఖచిత్రం మారుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రఫాని మీడియా సమావేశంలో మాట్లాడుతూ, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ హోదా వల్ల పట్టణంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలు చేరువవుతాయని పురపాలక సంఘంతో కొత్త కళ మెరుగైన వసతులు అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం



చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల కీలక ప్రాజెక్టుల గురించి ఈ క్రింది విధంగా ఆయన వివరించారు. టిట్కో షాపింగ్ కాంప్లెక్స్ సుమారు 3 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌కు తన హయాంలోనే శంకుస్థాపన జరగడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమృత్ పథకం కింద ఆటోనగర్, ఎన్ ఆర్ టి సెంటర్లలో అత్యాధునిక



షాపుల నిర్మాణం, అలాగే నూతన చేపల మార్కెట్ నిర్మాణం పట్టణ అభివృద్ధికి నిదర్శనాలని ఆయన పేర్కొన్నారు. సుగాలి కాలనీలో కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి మార్గదర్శకత్వంలో చిలకలూరిపేటను ఆదర్శవంతమైన పురపాలక సంఘంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# మిరప పంటపై రైతులకు అవగాహన సదస్సు

**పెదకాకాని, ఫిబ్రవరి 24. లక్ష్యం న్యూస్:** మండలం పరిధిలోని వెనిగండ్ల, కొప్పురావురు గ్రామమములు నందు ఉద్యాన శాఖ, ఉద్యాన అధికారి కె. దీపిక అద్వర్యం లో మిరప పంట పై సమగ్ర సస్య రక్షణ చర్యలు పై రైతులు కి అవగాహన కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమం లో మిరప లో వచ్చే నల్ల తామర పురుగు , బొబ్బర తెగలు కి, తీసుకోవలసిన నివారణ చర్యలు, మిరప కోత దశలో ,కోత అనంతరం తీసుకోవలసిన చర్యలు, ప్రస్తుత వాతవరణానికి వర్షం పడినపుడు మిరప కలెలో తీసుకొవల్సిన జాగ్రత్తలు పై రైతులు డా. సి.హెచ్. అనిల్ కుమార్,శాస్త్రవేత, కె వి కె తెలిపారు . ఈ కార్యక్రమం లో ఉద్యాన శాఖలో రైతులకు ఇచ్చా రాయతీలు, పథకాలు గురించి, వెదురు బొంగులు,




ఆయిల్ పామ్ తోటలకి కూడా రాయితీలు ఇస్తున్నట్లు ఉద్యాన అధికారి కె.దీపిక తెలియజేశారు. ఈ కార్యక్రమం లో



వ్యవసాయ పంటలు గురించి, జరుగుతున్న కార్యక్రమలు గురించి గ్రామ ఉద్యాన సహాయకులు దుర్గా నాయక్ తెలిపారు.

# యల్.బి.ఆర్.సి.ఈ లో కెరీర్ గైడెన్స్ పై అవగాహనా సదస్సు





**మైలవరం,ఫిబ్రవరి :24 (లక్ష్యం ప్రతినిధి )** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్.వెంకట రత్నం, NSF కో ఆర్డినేటర్, లయన్స్ క్లబ్ విజయవాడ డైమండ్స్ వారి ఆధ్వర్యంలో బి.టెక్ సెకండ్ ఇయర్ విద్యార్థిని , విద్యార్థులకు " కెరీర్ గైడెన్స్ " అనే అంశం పై అవగాహనా సదస్సును నిర్వహించారు . ఈ కార్యక్రమానికి శ్రీ.ఎమ్ .సాంబశివరావు , మేనేజింగ్ డైరెక్టర్ , మైక్రో లింక్ ,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ మరియు శ్రీమతి మేకా శ్రీలత (USA) NSF విజయవాడ చాప్టర్ వారు రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు . ఈ సందర్భం గా శ్రీ.ఎమ్ .సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఇంజనీరింగ్ లో మీకు నచ్చిన కోర్సులను ఎంచుకోని , చదివింది గుర్తు పెట్టుకోవడం కోసం ఎలాంటి పద్దతులను పాటించాలో తెలిపారు. శ్రీమతి మేకా శ్రీలత మాట్లాడుతూ చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం చాలా ముఖ్యమని మరియు డిజిటల్ మార్కెటింగ్, సెరీకల్చర్, యానిమేషన్ వంటి కోర్సులు ద్వారా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు . ఈ కార్యక్రమంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టీ లకిరెడ్డి పసంద్ కుమార్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్.బి రమేష్ రెడ్డి , కళాశాల NSF కో ఆర్డినేటర్ జి.నాగిరెడ్డి మరియు విద్యార్థిని , విద్యార్థులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ మాచర్ల డీఎం కార్యక్రమాని కి 14 విజ్ఞప్తులు



వినతలు స్వీకరిస్తున్న డిపో మేనేజర్ వీరాస్వామి

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** మాచర్ల డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ మాచర్ల డీఎం కార్యక్రమానికి మొత్తం 14 విజ్ఞప్తులు వచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి తెలిపారు. ప్రధానంగా వచ్చిన అభ్యర్ధనలు వివరాలు వెల్లడించారు. మాచర్ల పట్టణ శివారులోని చెన్నకేశవనగర్ కాలనీలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఇద్దరు కోరగా రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దుర్గి నుండి గురజాలకు బస్ సర్వీస్ ప్రారంభించాలని ఇద్దరు, మాచర్ల నుండి కర్నూలుకు ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేయాలని ముగ్గురు కోరగా ఆయా సర్వీసుల విషయంలో ప్రస్తుతం డిపోకు అదనపు బస్సులు లేనందున అమలు చేయలేకపోతున్నామని తెలిపారు. డిపోకు నూతన బస్సులు కేటాయిస్తే ఈ సర్వీసులు ప్రారంభించే అవకాశముందని స్పష్టం చేశారు. మాచర్ల-గుంటూరు ఎక్స్‌ప్రెస్ బస్సు కంభంపాడు వద్ద రిక్వెస్ట్ స్టాప్ కల్పించాలని ఆరుగురు కోరగా ఎక్స్‌ప్రెస్‌కు రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేసినట్లు చెప్పారు. మాచర్ల-కర్నూలు సర్వీస్ బోర్డును ఆత్మకూరులో ఏర్పాటు చేయాలని ఒకరు కోరగా ఆత్మకూరులో బోర్డు ఏర్పాటు విషయమై అక్కడి అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా మాచర్ల-చిలకలూరిపేట సర్వీసులు సమయపాలన పాటించేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు వీరాస్వామి వెల్లడించారు.

# ఆరోగ్య కేంద్రానికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ వితరణ



కాన్సన్ట్రేటర్‌ను అందజేస్తున్న ఓల్డ్ స్టూడెంట్స్

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన కీర్తిశేషులు బెల్లంకొండ కోదండ రామయ్య కుమారులు కోటేశ్వరరావు, రామ్మోహన్‌లు కంభంపాడు ఓల్డ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ తరపున కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను వితరణ చేశారు. సుమారు రూ. 38 వేల విలువ గల ఈ యంత్రం అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వెస్లీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ఓల్డ్ స్టూడెంట్స్ చురుకుగా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ ఆరోగ్య కేంద్రానికి ఎంతో మేలు చేస్తుందని, ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలతో వచ్చే రోగులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, బెల్లంకొండ జయమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ కె. సుబ్బారెడ్డి, స్టాఫ్ నర్స్ మరియరాణి తదితరులు పాల్గొన్నారు.


# పాఠశాలలో ఫైర్ మాక్ డ్రిల్



అగ్నినిరోధక పరికరాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో మాచర్ల అగ్నిమాపక కేంద్రం అధికారులు పట్టణంలోని గౌతమ్ పాఠశాలలో అగ్నిప్రమాద భద్రతపై విస్తృత స్థాయి ఫైర్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రమాద అవగాహన పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే దానిపై శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. మాక్ డ్రిల్ సందర్భంగా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు గందరగోళానికి లోనుకాకుండా ప్రశాంతంగా భవనం బయటకు వెళ్లే విధానం, అత్యవసర బయటకు వెళ్లే మార్గాల ప్రాముఖ్యత, అగ్నినిరోధక పరికరాల సక్రమ వినియోగం వంటి అంశాలను సిబ్బంది ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ను ఎలా ఉపయోగించాలి, భద్రతా పిన్ ఎలా తీసి మంటలను ఎలా లక్ష్యంగా చేసుకోవాలి, అగ్నిని ఎలా నియంత్రించాలి వంటి విషయాలను విద్యార్థులకు చూపించారు. అలాగే ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, పొగ ఎక్కువగా ఉన్న సమయంలో నేలకు దగ్గరగా వంగి కదలడం, విద్యుత్ లోపాల వల్ల కలిగే అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలి వంటి కీలక సూచనలు అందించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ప్రశ్నలు అడగగా అగ్నిమాపక సిబ్బంది సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఇలాంటి మాక్ డ్రిల్లులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అప్రమత్తత, ధైర్యం, సమయస్ఫూర్తి పెరుగుతాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు ఎప్పుడు సంభవిస్తాయో ముందుగా చెప్పలేమని, అందుకే ముందస్తు జాగ్రత్తలు అత్యంత అవసరమని సూచించారు. కార్యక్రమంలో మాచర్ల అగ్నిమాపక సిబ్బంది ఎలఎఫ్ ఆర్.హుస్సేన్, వి. నాగేశ్వరరావు, ఎలఎఫ్ ఏ. వెంకటేశ్వర్లు, డ్రైవర్ పి. ఆంజనేయులు, ఫైర్‌మెన్‌లు బాలకృష్ణ, నాగిరెడ్డి, రాజశేఖర్, వీరాంజనేయులు పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాలతో ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు

మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామ కళ్లాల్లో మిరపకాయలపై రైతులు పట్టాలు కప్పిన దృశ్యం

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే కోతల దశలో ఉన్న మిర్చి పంట తడిసి పాడైపోతుందేమోనన్న భయంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుండి పలుచోట్ల అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలతో కల్లాలపై ఎండబెట్టిన మిర్చి కాయలు ఎక్కడ తడిసిపోతాయోనని, వర్షం పడే సూచనలు కనిపించగానే రైతులు తొందరపడి కల్లాలపై పట్టలు, కప్పి రక్షించే ప్రయత్నం చేశారు. మండలంలో రైతులు కోసిన మొదటి, రెండవ కోత మిర్చి పంట కల్లాలపై ఉంది. సోమవారం రాత్రి కొద్దిపాటి వర్షం కురవగా మంగళవారం కూడా ఆకాశం మేఘావృతమై ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఎరుపు రంగు ఉన్న మిర్చి తడిసిపోతే నాణ్యత తగ్గిపోతుంది. రంగు మసకబారడం, నల్లబడే అవకాశమూ ఉంది. దీనివల్ల మార్కెట్‌లో ధరలు భారీగా పడిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను సాగు చేయడానికి ఇప్పటికే ఎకరాకు భారీగా ఖర్చు పెట్టామని, ఎరువులు, మందులు, కూలీల వ్యయాలు పెరిగిపోయాయని రైతులు వాపోతున్నారు. దానికి తోడు నల్లి, ఇతర తెగుళ్ల కారణంగా అనుకున్నంత దిగుబడి రాలేదని, అయితే ధరలు ఆశాజనకంగా వుండటంతో కొంత ఊరటలో ఉన్నామని, ఈ సమయంలో తుఫాన్ ప్రభావం కారణంగా పంట నష్టపోతే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

ప్రజా చైతన్యమే... లక్ష్యం తెలుగు దినపత్రిక
బుధవారం 25-2-2026

# గూడూరు లో టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి,

లక్ష్యం న్యూస్సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయం లో గూడూరు పట్టణం సాధుపేట సెంటర్ నుండి నారాయణ కాలేజీ మీదుగా మినీ బైపాస్ కు పోవు దారిలో రోడ్డు పై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీకొట్టగా ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు అని మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని మృతుడు ధరించిన బట్టలు,ఆనవాళ్ళు ను బట్టి వివరాలు తెలిసినవారు గూడూరు 1 టినీలిని పోలీస్ స్టేషన్ కి సమాచారం తెలుపగలరనీ ఎస్సై మనోజ్ కుమార్ కోరారు...

## ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ?

లక్ష్యం న్యూస్ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. విద్యార్థులు భయం లేకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనువుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసర గుంపులు ఏర్పడకుండా, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.అదేవిధంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయడంతో పాటు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నారు.
ప్రజలు పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని, విద్యార్థులు తమ పరీక్షలపై పూర్తి దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు బందోబస్తు కొనసాగుతుందని తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల రిలే దీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఈ నెల 23 నుంచి 27 వరకూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ నియమ నిబంధనలు రూపొందించాలని, పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో మార్చి 2న విజయవాడ ధర్నాచౌక్ లో మహాధర్నా నిర్వహించనున్నారు.

## రేవంత్ సవాల్ కు సై అన్న హరీష్ రావు

హైదరాబాద్ లక్ష్యం న్యూస్
అసెంబ్లీలో గోదావరి జలాల మీద చర్చిద్దామన్న రేవంత్ రెడ్డి సవాల్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్వీకరించారు. అయితే , మైక్ కట్ చేయొద్దు కెమెరా తిప్పొద్దు అదే మా షరతు. నువ్వు చంద్రబాబుకు ఎట్లా దాసోహం అయ్యావో, మేడిగడ్డను, సమ్మక్క బ్యారేజీని, దేవాదులను పండబెట్టి ఆంధ్రాకి నీళ్లు ఎలా వదులుతున్నావో, నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ మీద నీ చీకటి ఒప్పందాలు అన్ని అసెంబ్లీలో బయట పెట్టడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ మీద పెట్టిన శ్రద్ధ 10 శాతం హెల్త్ సిటీ మీద పెడితే బాగుండేది. కేసీఆర్ శ్రద్ధ హెల్త్ సిటీ మీద పెడితే.. రేవంత్ రెడ్డి శ్రద్ధ ఫ్యూచర్ సిటీ మీద పెట్టాడు. కేసీఆర్ పేదల కోసం హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, కాంట్రాక్టర్ల కోసం ఫ్యూచర్ సిటీ మీద శ్రద్ధ చూపిస్తున్నాడని అన్నారు.

## నర్సింహారెడ్డి కాలేజీలో జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన

మేడ్చల్.... లక్ష్యం న్యూస్
విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని జె.ఎన్. టి.యూ.హెచ్ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం మేడ్చల్ జిల్లా మైసమ్మగూడ లోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇగ్నైట్ 2కె26 పేరుతో జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభతో తయారు చేసిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతినిధులు ప్రదర్శనలను తిలకించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు వైపు దృష్టి సరించినప్పుడే నైపుణ్యం బయట పడుతుందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రదర్శించి ప్రత్యేకత కలిగి ఉంటే వాటికి పేటెంట్ హక్కులను పొంది అభివృద్ధి వైపు అడుగులు వేయవొచ్చని సూచించారు.

## జనగణన-2027 సర్వే రాజ్యాంగబద్ధమైనది

నెల్లూరు లక్ష్యం న్యూస్
సాధారణ కోవిడ్, కుటుంబ సర్వేల కంటే జనగణన-2027 సర్వే రాజ్యాంగబద్ధమైనదని, దానిని క్రమపద్ధతిలో, అప్రమత్తతతో నిర్వహించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ హిమాన్షు శుక్లా అన్నారు. నెల్లూరు హరనాథపురం లోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో జిల్లా అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణా తరగతులలో అందరూ జనగణన ప్రక్రియపై అవగాహన పొందాలని సూచించారు.

# పాల కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు

కృష్ణా జిల్లా లక్ష్యం న్యూస్
కల్తీ పాలు తాగి రాజమండ్రిలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పాల కేంద్రాల వద్ద ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కరెన్సీ నగర్లోని ఓ పాల కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించారు. పాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్కు పంపించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిగాయి.

# పాతబస్తీ హిందువులకు రక్ష భాగ్యలక్ష్మి అమ్మవారు
## కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ లక్ష్యం న్యూస్
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు.కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా కరీంనగర్ మహాశక్తి అమ్మవారి, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే తట్టుకుని కరీంనగర్ లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నాం. మొక్కులు తీర్చుకునేందుకే భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చాం. బాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం చాలా పవర్ ఫుల్..బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంజాబ్ స్వర్ణ దేవాలయం తరహాలో భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తామని అన్నారు.పాతబస్తీ హిందువులకు రక్ష భాగ్యలక్ష్మి అమ్మవారు. గతంలో ఎంతో మంది హిందువులు పాతబస్తీ నుండి వెళ్లారు. అమ్మవారి శక్తి తెలుసుకుని మళ్లీ పాతబస్తీకి విచ్చేశారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించిన. కేసీఆర్ సర్కార్ దాడులను తట్టుకుని ప్రజా సంగ్రామ యాత్రను దిగ్విజయం చేశాం. ప్రజాసంగ్రామ యాత్ర ద్వారా 1640 కి.మీలు నడిచిన. పాదయాత్ర ప్రారంభించి 1640 రోజులు పూర్తయ్యింది. మజ్లిస్ కంచుకోటను బద్దలు కొట్టి ఇదే చోట ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినా. హైదరాబాద్ లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకోవడానికి మేం సిద్ధం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా మా బూట్లు నాకాల్సిందేనని మజ్లిస్ నేతలు చెబుతున్నారంటే సిగ్గుండాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలరా మీది ఓ బతుకేనా? మీరు నిజంగా హిందువులైతే మీలో రక్తం ఉంటే ఆ పార్టీలను వదిలి కాషాయ జెండా పట్టండి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 27 నెలలైంది నాటి నుండి నేటి వరకు దేవాలయాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి మొదలు సంతోష్ నగర్ భూలక్ష్మి, బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయి. ఇంత పెద్ద ఎత్తున ఆలయాలపై దాడులు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని అన్నారు.గోహత్యలు, లవ్ జిహాదీల పేరుతో హిందూ అమ్మాయిలపై డ్రగ్స్ ఇస్తూ అత్యాచారాలు చేస్తున్నా స్పందించరా? హిందూ ధర్మాన్ని కాపాడాలనే సంకల్పంతో కసితో మేం పనిచేస్తున్నాం. హిందూ సమాజం జాగ్రుతం కాకపోతే అందరవి బిచ్చపు బతుకులే అవుతాయి. హనుమాన్, అయప్ప, భవానీ మాల వేసుకుంటే సెలవు ఇవ్వరు. మాల వేసుకున్న పిల్లలను కూడా స్కూలుకు రానీయ్యడం లేదు. అయినా భరిస్తూ ఉందామా, కరీంనగర్ లో ముస్లిం మహిళలంతా ఒక్కటై బీజేపీకి ఓటేశారు. బాన్సువాడలో ఎంఐఎం పార్టీ నేతలు హిందువులపై రాళ్ల దాడి చేసినా పట్టించుకోరా? ఆ రాళ్లదాడి ద్రుశ్యాలను డీజీపికి, మీడియాకు పంపినా పట్టించుకోలే, దాడి బాధ్యులను కాకుండా బాధితులను, అమాయక హిందువులను అదుపులోకి తీసుకోవడం సిగ్గు చేటని అన్నారు.పోలీసులారా మీరు వెంటనే అక్రమ అరెస్టులు ఆపండి.. దాడులు చేసిన ఎంఐఎం గూండాలను వెంటనే అరెస్ట్ చేస్తారా? లేదా? లేనిపక్షంలో నేనే స్వయంగా బాన్సువాడకు వెళతా హిందువులకు రక్షణ కవచంగా నిలుస్తానని అన్నారు.

## మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా రక్షణ చట్టాలు మరియు మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పిస్తున్న కృష్ణాజిల్లా పోలీసులు.








**మచిలీపట్నం ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్**
మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, శక్తి టీం మరియు ఈగల్ టీం సభ్యుల ఆధ్వర్యంలో మచిలీపట్నంలో గల విజయానంద డిగ్రీ కాలేజీ నందు విద్యార్థినీ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యసనం, సైబర్ క్రైమ్, పోక్సో చట్టం, శక్తి యాప్ యొక్క ఆవశ్యకత మరియు ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.
మాదక ద్రవ్యాల వలన శారీరక, మానసిక మరియు సామాజికంగా కలిగే తీవ్రమైన దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించబడింది.
అదనంగా సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, అనుమానాస్పద లింకులు, ఫేక్ అకౌంట్లు, ఆన్లైన్ మోసాల నుండి జాగ్రత్తలు తీసుకోవడం వంటి విషయాలు తెలియజేశారు.
పిల్లల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, చట్టపరమైన రక్షణలు మరియు సహాయ మార్గాల గురించి కూడా విద్యార్థులకు తెలియజేయబడింది.
ప్రతి ఒక్కరు శక్తి యాప్ను కలిగి ఉండాలని దాని యొక్క వినియోగం మరియు ఆవశ్యకతల గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరిగినది.
రహదారి భద్రత నియమాలు పాటించడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలియజేయడం జరిగినది.
కార్యక్రమం మొత్తం సమయంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో, ఈ అవగాహన కార్యక్రమం వారి భద్రత, బాధ్యత మరియు చట్టపరమైన అవగాహనను పెంపొందించే దిశగా ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

# ప్రపంచ శాంతి కోసమే దివ్యజ్ఞాన సమాజం..
## ప్రముఖ ఆడిటర్ సి. శేషాచార్యులు











**మచిలీపట్నం, ఫిబ్రవరి 24లక్ష్యం న్యూస్**
ప్రపంచ శాంతి కోసమే భారతదేశం వ్యాప్తంగా దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తుందని ప్రముఖ ఆడిటర్ సీనియర్ సభ్యులు సి. శేషాచార్యులు (అప్పాజీ )అన్నారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర దివ్యజ్ఞాన సమాజ సదస్సుకు మచిలీపట్నం నుండి హాజరైన ఆరు సభ్యులను సన్మానించడానికి మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం మంగళవారం సాయంత్రం ఈడేపల్లి లో ని ఆల్కాట్ లాడ్జ్ బిల్డింగ్ లో మచిలీపట్నం శాఖ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆడిటర్ అప్పాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలాతీత జ్ఞానానికి అంకితం కావాలని, నిత్యం సత్యము అనేది అంతులేని శక్తిని ఇస్తుందని అన్నారు. జిడ్డు కృష్ణమూర్తి రచనల ద్వారా ప్రతి ఒక్కరూ స్వయంకృషితో ఎదగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానం పొందాలని అప్పాజీ అన్నారు. కులాలకు మతాలకు ప్రాంతాలకి అతీతంగా ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని అప్పాజీ అన్నారు. దివ్యజ్ఞాన సమాజం జాతీయ స్పీకర్ విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ మతాల సర్వోన్నత సత్యాన్ని అందరూ గ్రహించాలని, అన్ని మతాల మానవ మహోన్నత విలువలను నేటి యువతరం అందించాలని అన్నారు. అందుకోసం దివిజ్ఞాన సమాజం 150 సంవత్సరాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సదస్సులో రాజమండ్రిలో గత వారం మచిలీపట్నం నుండి ఆరుగురు సీనియర్ సభ్యులు హాజరు కావడం అభినందనీయమని అన్నారు. సమాజ మార్పు కోసం యువతలో నైతిక విలువలు పెంచడం కోసం దివ్యజ్ఞాన సమాజం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.మరో సీనియర్ సభ్యులు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వకాలీనమైన సత్యాన్ని తెలుసుకోవడమే దివ్యజ్ఞానం అని అన్నారు. ప్రతి ఒక్కరూ వారిలోని అంతర్గత శక్తులను తెలుసుకోవాలని అన్నారు.
ద్వివ్యజ్ఞాన సమాజం కార్యదర్శి కొత్తకొండు రమేష్ రాష్ట్ర సదస్సు కార్యక్రమాలను వివరించారు. అనంతరం గౌరవ అధ్యక్షులు అప్పాజీని రాష్ట్ర సదసు కి హాజరైన ఆరుగురు సభ్యులను మచిలీపట్నం దివ్య జ్ఞాన సమాజం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం. సత్యనారాయణ సీనియర్ న్యాయవాది గుడిసేవ మురళి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# "విజయవాడ అభివృద్ధే మా లక్ష్యం"
## -ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం

విజయవాడ లక్ష్యం న్యూస్
విజయవాడ : నగర అభివృద్ధే లక్ష్యంగా... విజయవాడ నగరాన్ని భవిష్యత్లో ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇందుకోసం స్ట్రాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, డ్రింకింగ్ వాటర్ పనులతో పాటు నగర సుందరీకరణ కి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) తయారైందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. గ్రేటర్ విజయవాడ కాకముందే నగరంలోని సమస్యలను ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిలతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నగరాభివృద్ధిపై కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, కార్పొరేటర్ చంటి తదితరులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ రానున్న వర్షాకాలం దృష్ట్యా, నగరంలో వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా స్ట్రాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు విజయవాడ నగర పాలక సంస్థ వారు తయారుచేసిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సమీక్షించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం పంట కాలువ డ్రైన్ 2.5 మీటర్లు ఉండగా ప్రస్తుత డిపిఆర్ ప్రకారం 8 మీటర్లకు వెడల్పు పెంచడం వల్ల వర్షపు నీరు నగరంలో నిలవ ఉండకుండా ప్రవహించేటట్టు చర్యలు తీసుకున్నామన్నారు. నగరంలో ఇంకా ను వర్షపు నీటి డ్రైన్ ల నిర్మాణం ఎక్కడైతే అసంపూర్తిగా ఉన్నాయో వాటిని పూర్తి చేసేటట్టుగా, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో వర్షపునీటి నిలువల సమస్య లేకుండా ఈ డ్రైన్లు నిర్మించే విధంగా డిపిఆర్ తయారు చేశామని అన్నారు. అమరావతి ప్రాంతానికి అనుబంధంగా ఉన్న విజయవాడ నగర అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గత సంవత్సరం నుంచే స్ట్రామ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సరఫరాకు సంబంధించి డీపీఆర్ (ఆఖఖీ) సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిపారు. గత పాలక మండలి డిపిఆర్ సిద్ధం చేయటానికి కూడా సుముఖత వ్యక్తం చేయకపోవటంతో.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో డీపీఆర్ పూర్తి చేయించినట్లు తెలిపారు. గతంలో ఎల్ అండ్ టీ సంస్థ చేపట్టిన డ్రైనేజ్ వ్యవస్థ, స్ట్రాంమ్ వాటర్ పనుల్లో ఉన్న లోపాలను గుర్తించామని, వాటిని సరిదిద్దుతూ ఎక్కడా సమస్యలు లేకుండా సమగ్ర డీపీఆర్ రూపొందిస్తున్నామని వివరించారు. నగరంలో నేషనల్ హైవేలో, పలు ప్రాంతాల్లో రాబోయే ఆర్.ఓ.బీలు (ఖీ౦ఃలు), ఆర్.యూ.బీలు (ఖీజఃలు) నిర్మాణానికి సంబంధించిన పనుల్లో రైల్వే, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి , మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సమన్వయం చేసుకునే దిశగా ప్రత్యేకంగా సమావేశం నిర్వహించే అంశంపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు నగరంలోని మూడు ప్రధాన కాలువలను అందంగా తీర్చిదిద్దే ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువల్లో కలిసే ప్రాంతాల్లో మినీ ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.రాబోయే గ్రేటర్ విజయవాడను దృష్టిలో ఉంచుకుని నగరంలో చిన్నచిన్న సమస్యల పరిష్కారం నుంచి భారీ మౌలిక సదుపాయాల వరకు అన్ని అంశాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి లతో కలిసి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యేలతో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించి పూర్తి ప్రణాళికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు

# పరిషత్ ఎన్నికలకు లాంగ్ బ్రేక్...

హైదరాబాద్, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్

తెలంగాణలో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. 7 మున్సిపల్ కార్పోరేషన్లతో పాటు 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక పంచాయతీ ఎన్నికలు కూడా డిసెంబర్‌లో ముగిశాయి. ఇక మిగిలింది జిఖఅ, ఓఖఅ ఎన్నికల ప్రక్రియే. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ సత్తా చాటింది. 80 శాతానికి పైగా స్థానాలు కైవసం చేసుకుంది. ఇదే ఊపులో మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రాజకీయ నిరుద్యోగులు సైతం త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికల నిర్వహణపై అప్డేట్ వచ్చింది.ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కనిపించటం లేదు. ఎందుకంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి బిల్లును రూపొందిచగా.. ప్రస్తుతం అది కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏదో ఒకటి తేల్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సోమవారం సెక్రటేరియట్‌లో జరిగిన కేబినెట్ భేటీలోనూ ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానాన్ని, బిల్లును కేంద్రానికి ఇప్పటికే పంపినందున దానిపై ఎలాంటి నిర్ణయం వస్తుందో వేచిచూద్దామని సీఎం మంత్రులతో అన్నట్లు సమాచారం. అప్పటి వరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లకుండా ఉందామని మంత్రులతో సీఎం రేవంత్ అన్నట్లు సమాచారం. సీఎం నిర్ణయానికి మంత్రులు కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలు కనిపించటం లేదని ప్రభుత్వ వర్గాల ద్వారా వెల్లడైంది.ఇక తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెల 3 నుంచి జూన్ 2న జరిగే రాష్ట్రావతరణ దినోత్సవ రోజు వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కేబినెట్ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ప్రతి ప్రభుత్వ శాఖలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకంగా నివేదిక తయారు చేయటంతో పాటు.. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని సీఎం రేవంత్ సీఎస్ రామకృష్ణారావుకు సూచించినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.

# గ్రేటర్ కోసం భారీ వ్యూహం...

హైదరాబాద్ ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 1500కు పైగా వార్డులను కైవసం చేసుకుంది. 90 శాతానికి పైగా మున్సిపాలిటీలలో అధికార పార్టీ జెండా ఎగురవేయగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కేవలం 772 వార్డులకే పరిమితమైంది. పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ పథకాలు, రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలు నమ్మకం ఉంచారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అందుకే హైదరాబాద్ లో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు కార్పొరేషన్లలో గెలవడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. దశాబ్ద కాలంగా పట్టణ ఓటర్లపై తిరుగులేని పట్టున్న బీఆర్ఎస్ ఈసారి భారీగా నష్టపోయింది. 90 శాతం మున్సిపల్ కౌన్సిళ్లపై నియంత్రణ కోల్పోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల కంటే, ప్రస్తుత ప్రభుత్వ గ్యారంటీ లకే ప్రజలు ఆకర్షితులయ్యారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలు, బలమైన క్షేత్రస్థాయి సమన్వయం లోపించడం కూడా ఈ ఓటమికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మున్సిపల్ ఫలితాల ఊపుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు జీహెచ్ఎంసీపై దృష్టి సారించింది. 2026 చివరలో లేదా 2027 ప్రారంభంలో జరగనున్న గ్రేటర్ ఎన్నికల కోసం ప్రభుత్వం భారీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిని ప్రస్తుతం ఉన్న 650 చదరపు కిలోమీటర్ల నుండి 2000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించే ప్రతిపాదన తెచ్చింది. చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీలను గ్రేటర్ లో విలీనం చేయడం ద్వారా ఓటర్ల సంఖ్యను పెంచి, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. జీహెచ్ఎంసీని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి విభజించారు. గతంలో వైఎస్ఆర్ అనుసరించిన ఫార్ములాను రేవంత్ అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే మూడు కార్పొరేషన్ల ఎన్నికల లోపు నగర రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. మూసి నది పునరుజ్జీవనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూ.2,787 కోట్ల కేటాయింపు, బంజారాహిల్స్ నుండి శిల్పా లేఅవుట్ వరకు కొత్త రహదారి నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా విశ్వనగరం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా నగర ఓటర్ల మనసు గెలవాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది.ప్రస్తుత ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ దూకుడును అడ్డుకోవడానికి బలమైన నాయకత్వం, స్థానిక అజెండాతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ తన పాత కోటను కాపాడుకోవడానికి నగర వాసుల్లో మళ్ళీ నమ్మకం కలిగించాల్సి ఉంది. ఈ త్రిముఖ పోరులో రేవంత్ రెడ్డి సర్కార్ వేస్తున్న ముందడుగులు విపక్షాలకు మున్ముందు గడ్డు కాలం మిగిల్చేలా ఉన్నాయి.

# అన్నాడీఎంకే ను లైట్ తీసుకున్నారా...

చెన్నై, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. వేలూరులో ప్రచార సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతం జరుగుతుందని, టీవీకే క్లీన్ స్వీప్ చేస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానంగా పోటీ కేవలం తమ పార్టీకి, అధికార డీఎంకేకు మధ్యే ఉంటుందని ప్రకటించడం ద్వారా, అన్నాడీఎంకే ఉనికిని ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. క్షేత్రస్థాయిలో డీఎంకేకు ప్రత్యామ్నాయం తామేనని ప్రజలకు సంకేతాలు పంపడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.తమిళనాడు అంటే విజయ్.. విజయ్ అంటేనే తమిళనాడు అంటూ గతాన్ని గుర్తు చేస్తూ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. డీఎంకే పాలనపై విజయ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది స్టాండప్ కామెడీ ప్రభుత్వమని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన ప్రభుత్వం సూపర్ స్టార్ మోడల్ అని చెప్పుకుంటున్నారని, కానీ అది నిజానికి సూపర్ స్టాండప్ కమెడియన్ మోడల్ అని ఎద్దేవా చేశారు. స్టాలిన్ ప్రకటిస్తున్న పథకాలు, చేస్తున్న వాగ్దానాలు కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని ఆరోపించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా కేవలం తన పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడానికేనని, అవి స్టాలిన్ ఆపరేటింగ్ ప్రొసీజర్' లా మారిపోయాయని విమర్శించారు. గత ఏడాది కరూర్ ర్యాలీలో జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయ శత్రువులు ఎవరూ లేరని చెప్పే స్టాలిన్, మరి ఆ ఘటనకు తనను ఎందుకు బాధ్యుడిని చేశారని నిలదీశారు. ప్రభుత్వం కావాలనే తక్కువ స్థలం ఉన్న ప్రాంతాల్లో సభలకు అనుమతి ఇచ్చి, భద్రతా వైఫల్యాలకు కారణమైందని ఆరోపించారు. 2026 ఎన్నికలు దుష్ట శక్తి, స్వచ్ఛమైన శక్తి మధ్య జరిగే పోరాటమని ఆయన అభివర్ణించారు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది తనతోనే సాధ్యమని విజయ్ బలంగా నమ్ముతున్నారు. స్టాలిన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు ప్రతిపక్ష కూటమి రేసులో లేదని చెప్పడం ద్వారా ఓటర్లను తనవైపు తిప్పుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికలను 'విజయ్ వర్సెస్ స్టాలిన్' మధ్య జరిగే పోరుగా అభివర్ణిస్తున్నారు. అన్నాడీఎంకే పట్టు కోల్పోయిన స్థానాల్లో టీవీకే తన బలాన్ని పెంచుకుంటే, అది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలో పేదల ఇండ్ల కూల్చివేతలు

ఖమ్మం లక్ష్యం న్యూస్

ఖమ్మం నగర శివారులో వెలగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల్లో అధికారులు ఇండ్ల కూల్చివేతలు ప్రారంభించారు. వెలుగుమట్లలోని 60 ఎకరాల భూదాన్ భూముల్లో నివసిస్తున్న 600 కుటుంబాలను ఖాళీ చేయించేందుకు వెళ్లారు. ఈనేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. జేసీబీల సహాయంతో గుడిసెలను తొలగించారు. పదేళ్ళుగా ఇక్కడే నివసిస్తున్నాం తమకు పట్టాలు ఇవ్వాలని నిర్వాసితులు అంటున్నారు. కాంగ్రెపస్ పార్టీకి ఓటు వేసినందుకు తగిన శాస్తి అయిందంటూ బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు. కవరేజ్ కోసం వెళ్తున్న మీడియా ప్రతినిధులను కుడా పోలీసులు అడ్డుకున్నారు.

# శివారు ప్రాంతాల్లో రియల్ ఢమాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 24. లక్ష్యం న్యూస్

గత కొన్నేళ్లుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ఊహించని మందగమనాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా నగరం నుండి 50 నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్ , వికారాబాద్ జిల్లాల పరిధిలోని వ్యవసాయ భూముల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. గతంలో ఎకరాకు కోట్లు పలికిన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు కొనుగోలుదారులు కరువవ్వడం, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడం జిల్లా స్థాయి విశ్లేషణల్లో స్పష్టంగా కనిపిస్తోందిపెట్టుబడిదారులు ప్రస్తుతం వేచి చూసే ధోరణి ని అవలంబించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మారుతున్న భూవినియోగ విధానాలు, , మూసీ రివర్ ఫ్రంట్ వంటి భారీ ప్రాజెక్టుల పునర్నిర్మాణ నిర్ణయాల కారణంగా .. ఏ భూమి ఏ జోన్‌లోకి వస్తుందో అన్న ఆందోళన ఇన్వెస్టర్లలో నెలకొంది. దీనికి తోడు పెరిగిన మార్కెట్ విలువల వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు భారం కావడంతో, సామాన్య , మధ్యతరగతి పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారు.గతంలో వెంచర్ల పేరుతో వ్యవసాయ భూములను భారీ ధరలకు విక్రయించిన రియల్టర్లు ఇప్పుడు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. నగరం చుట్టూ ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్ , ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల అలైన్‌మెంట్ విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో, భారీ పెట్టుబడులు పెట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు మాత్రమే తక్కువ ధరకైనా భూములు అమ్ముకోవడానికి సిద్ధపడుతుండగా, కొత్తగా కొనేవారు మాత్రం భద్రత లేనిదే ముందుకు రావడం లేదుఈ స్తబ్దత మరికొన్ని నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం భూసేకరణ , జోనింగ్ నిబంధనలపై పూర్తిస్థాయి స్పష్టత ఇస్తే తప్ప, శివారు ప్రాంతాల్లో మళ్లీ రియల్ జోరు పెరగడం కష్టమని తెలుస్తోంది. ప్రస్తుతానికి మాత్రం హైదరాబాద్ చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల మార్కెట్ పూర్తిగా బ్రేక్ పడినట్లుగా కనిపిస్తోంది.

# కర్ణాటక కాంగ్రెస్ లో మరో వివాదం

## - 38 మంది ఎమ్మెల్యేలు చాన్స్ ఇవ్వాలంటూ లెటర్

బెంగళూరు, ఫిబ్రవరి 24 లక్ష్యం న్యూస్

కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పదేపదే ఢిల్లీకి వెళ్లి వస్తున్నారు. ఇదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడంతో సీఎం మార్పుపై రెండు మూడు రోజుల్లో ఏదో ఒక నిర్ణయం వెలువడుతుందనే సంకేతాలు వస్తున్నాయి. ఇదే సమయంలో తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ పెద్దలకు లేఖ రాయడం మరో కొత్త సమస్య వచ్చి పడింది.కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్ ఇంకా వీడలేదు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం మరోసారి ఆసక్తికర పోరు నెలకుంది. సీఎం మార్పు తప్పదని కొన్నాళ్లుగా ప్రచారం సాగుతోంది. ఈ సాగదీత పార్టీకి మంచిది కాదని, 2028 ఎన్నికల్లో గెలవాలంటే తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. కర్ణాటక పంచాయతీ హైకమాండ్‌కు పంటి కింద నలుసులా మారింది. ఈ తరుణంలో మరో కొత్త తలనొప్పి వచ్చి పడింది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పాటు సీఎం సిద్ధరామయ్య, డీకేలకు తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు లేఖ రాశారు.కొత్తగా ఎన్నికైన తమకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాల్సి కోరుతూ 'యువ నాయకత్వం కోసం ప్రజల నుంచి వచ్చిన స్పష్టమైన తీర్పు' అని వారు ఆ లేఖలో అభివర్ణించారు. 2023 ఎన్నికల్లో విజయం తర్వాత 34 మందితో ఏర్పడిన మంత్రివర్గంలో తమలో ఎవరికి అవకాశం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. 'మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారికి కూడా క్యాబినెట్‌లో చోటు కల్పించడం న్యాయమైందే' అని డిమాండ్ చేశారు. కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని కోరిన వారు.. కనీసం ఐదుగుర్ని క్యాబినెట్‌లోకి తీసుకుంటే అనుభవానికి యువశక్తి,తోడైతే పాలన మరింత మెరుగుపడటానికి సహాయపడుతుందని వాదించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన తమకు మంత్రులుగా అవకాశం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లోకి తీసుకోవడం అసాధారణమేమీ కాదన్న వారు.. పలు రాష్ట్రాల్లో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులుగా, సీఎంలుగా కీలక బాధ్యతలు అప్పగించిన సందర్భాలున్నాయని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ సిద్ధాంతం, పారదర్శక పాలన పట్ల తమ నిబద్ధతను నొక్కి చెబుతూ.. యువ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించడం వల్ల పార్టీ సంస్థాగతంగా బలోపేతమవుతుందని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుందని ఆ ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాయకత్వం మార్పుపై మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానికి ఈ లేఖతో కొత్త చిక్కు వచ్చి పడింది.నాయకత్వ మార్పుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ సంచలనంగా మారింది. తనను దెబ్బతీయడానికి కొందరు కుట్రలు చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన తనపై రాజకీయ కుట్రలు సహజమేనని సిద్ధరామయ్య అన్నారు. అయితే, తాను పిరికివాడిని కాదని, అలాగే తన రాజకీయ జీవితం పూలబాట కాదన్నారు. ప్రజా మద్దతుతోనే రాళ్లు, ముళ్లున్న రాజకీయ రహదారిని దాటుతూ వచ్చానని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటీవల తనను కలిసిన మంత్రులు సతీష్ జార్ఖిహోళి, మాజీ మంత్రి రాజణ్ణ, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం సూచిస్తామని చెప్పారు.

# గులాబీ మౌనం...

హైదరాబాద్, ఫిబ్రవరి 24. లక్ష్యం న్యూస్

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే.. ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతా వారి చుట్టూనే తిరుగుతోంది.మరోవైపు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది.కేవలం మౌనంగా ఉంటే ఇతర పార్టీల దూకుడు పెరిగి తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని అధిగమించేందుకు త్వరలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, పాదయాత్రలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలకు రూపకల్పన చేసే అవకాశం ఉంది. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్యాడర్‌ను ఉత్తేజితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు కొంత హెచ్చరికగా మారాయి. కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోగా, బీజేపీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో పుంజుకుంది. ఈ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎక్కడ విఫలమయ్యామనే అంశంపై ఇప్పటికే అంతర్గత సమీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లడమే తదుపరి లక్ష్యంగా కనిపిస్తోంది.బీఆర్ఎస్ మళ్లీ తన ప్రాభవాన్ని చాటుకోవాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై మరోసారి గళం విప్పడం ద్వారా తెలంగాణ అస్తిత్వ కార్డును వాడే అవకాశం ఉంది. కాంగ్రెస్ వైఫల్యాలను, బీజేపీ రాజకీయాలను ఒకేసారి టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షించే పార్టీ అనే నినాదంతో ముందుకు వెళ్తేనే తిరిగి ఆ రెండు పార్టీలకు ధీటైన పోటీ ఇచ్చే అవకాశం ఉంటుంది.

# ఆ విభాగాలు నిద్రపోతున్నాయా...

## తప్పు ఒకరిది... శిక్ష మరొకరికా

హైదరాబాద్, ఫిబ్రవరి 24. లక్ష్యం న్యూస్

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పేరుతో హైదర్ షా కోట్‌లోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌కు మార్కింగ్ ఇవ్వడం వివాదానికి దారితీసింది. దశాబ్ద కాలంగా ప్రశాంతంగా నివసిస్తున్న వందలాది కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి రావడంతో నివాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అపార్టుమెంట్ నదీగర్భంలో ఉందని మార్కింగ్ ఇచ్చారు. కానీ ఈ అపార్టుమెంట్ కు ఊఓఆం, ఉఊఓఅ నుండి అన్ని అనుమతులు వచ్చాయి. బ్యాంకు లోన్లు కూడా వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులో భాగంగా మూసీలో ఉందని చెబుతున్నారు.ఈ అపార్ట్‌మెంట్ నది గర్భంలోనే ఉంటే, అసలు రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ప్రభుత్వ యంత్రాంగం అనుమతులు ఎలా మంజూరు చేసింది? సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ పత్రాలనే నమ్ముతారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆ భూమిని రిజిస్టర్ చేసి, మున్సిపల్ శాఖ ప్లాన్ అప్రూవల్ ఇచ్చినప్పుడు అది చట్టబద్ధమైనదే అని ఎవరైనా భావిస్తారు. ఇప్పుడు ఏళ్ల తర్వాత అది ఆక్రమణ అని తేల్చడం అంటే, అప్పట్లో తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారుల వైఫల్యాన్ని సామాన్యుల మీద రుద్దడమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బాధితులను పరామర్శించిన రాజకీయ నేతలు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోకుండా, అమాయక కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక పక్క పన్నులు వసూలు చేస్తూ, మరోపక్క ఆ ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి కూల్చివేస్తామనడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని నివాసితులు ధ్వజమెత్తుతున్నారు. ఇది కేవలం ఒక అపార్ట్‌మెంట్ సమస్య కాదని, ప్రభుత్వ అనుమతులను నమ్మి ఇళ్లు కొనుక్కున్న ప్రతి ఒక్కరి భద్రతకు సంబంధించిన ప్రశ్న అని వారు వాదిస్తున్నారు. అయితే ప్రభుత్వం పరిహారం ఇస్తామని చెబుతోంది.ఈ అపార్టుమెంట్ బిల్డర్.. మొదటి నుంచి తెలివిగా వ్యవహరించారు. ఈ అపార్టుమెంట్ కాంప్లెక్స్ లో చాలా మంది జర్నలిస్టులకు ఫ్లాట్లు అమ్మారు. ఇందులో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్ తో పాటు చాలా మంది జర్నలిస్టులు ఫ్లాట్లు కొనుక్కున్నారు. ఎప్పుడైనా వివాదం అయితే .. వీరే మీడియాలో హడావుడి చేసి కాపాడుకుంటారన్న ఉద్దేశంతో ఇలా చేశారేమో తెలియదు కానీ.. ఇప్పుడు ఈ కారణంగానే మీడియాలోనే హైలెట్ అవుతోంది. ఆ అపార్టుమెంట్ అక్రమం అయితే ప్రభుత్వం తక్షణమే స్పందించి, అనుమతులు ఇచ్చిన అధికారుల బాధ్యతను కూడా నిర్ణయించాలని, బాధితులకు న్యాయమైన నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయం చూపకుండా ఎటువంటి చర్యలు తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తుందో?

# వివాదానికి తెరలేపిన మంత్రి వాసంశెట్టి!

హైదరాబాద్, ఫిబ్రవరి 24. లక్ష్యం న్యూస్

రాష్ట్ర విభజన జరిగి దాదాపు పుష్కర కాలం సమీపిస్తోంది. ఎవరి పాలన వారు చేసుకుంటున్నారు. అయితే ప్రత్యేక భావోద్వేగ కోరికలతో ఏర్పడింది తెలంగాణ(. అయితే మూడు ఎన్నికలు జరగగా.. రెండు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం పనిచేసింది. తెలంగాణ తెచ్చిన పార్టీగా టిఆర్ఎస్ను అందలం ఎక్కించారు తెలంగాణ ప్రజలు. 2023లో మాత్రం తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను గుర్తించి అధికారం ఇచ్చారు. ఇలా చూసుకున్న తెలంగాణలో సెంటిమెంట్ అస్త్రం ఉండనే ఉందన్నమాట. అందుకే అక్కడ అన్ని రాజకీయ పార్టీలు ఎంత మాత్రం సెంటిమెంట్ లభిస్తే పొలిటికల్ గా చొచ్చుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటికి మొన్న కోనసీమ పర్యటనలో భాగంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిష్టి అనే మాట వ్యాఖ్యానించేసరికి.. రాజకీయ పార్టీలన్నీ ఏకమైపోయాయి. ఆ ఒక్క మాటను పట్టుకొని రాజకీయ విమర్శలు చేశాయి. అయితే ఇప్పుడు మరో ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ తమ కులానికి రిజర్వేషన్ల విషయంలో కెసిఆర్ అనుసరించిన వైఖరి పై మండిపడ్డారు. ఈ క్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి తెలంగాణలో సెంటిమెంట్ కు కారణం కానున్నాయి.రాష్ట్రంలో శెట్టిబలిజలు ఉన్నారు. బీసీలు గానే గుర్తిస్తుండేవారు ఆ వర్గాన్ని. అయితే రాష్ట్ర విభజన తర్వాత.. తెలంగాణలో శెట్టిబలిజలను బీసీలనుంచి ఓసీలుగా మార్చారు. అయితే ఒకసారి బీసీలుగా గుర్తించిన తర్వాత ఓసీలుగా మార్చడం అరుదు. అప్పట్లో శెట్టిబలిజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. కానీ కెసిఆర్ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. శెట్టిబలిజలను ఓసీలుగా నే భావించింది. ఆ జాబితాలో చేర్చేసరికి రిజర్వేషన్ల ఫలాలు శెట్టిబలిజలకు లేకుండా పోయాయి. రాజకీయంగా కూడా మనుగడ సాధించేందుకు ఇబ్బందికరంగా మారింది.అయితే తాజాగా ఇదే విషయంపై మాట్లాడారు మంత్రి వాసంశెట్టి సుభాష్. శెట్టిబలిజల సామాజిక వర్గ కార్యక్రమానికి గాను ఆయన హాజరయ్యారు. ఆ సామాజిక వర్గ ప్రతినిధిగా మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఏపీలో భారతీయ రాష్ట్ర సమితిగా పిలవబడే గులాబీ పార్టీ విస్తరణకు శరవేగంగా అడుగులు పడిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ప్రధానంగా కాపు, బలిజలను టార్గెట్ చేసుకొని ఇక్కడ పార్టీ విస్తరించాలని చూశారు. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ రాష్ట్ర సమితి ఓటమితో ఆ ప్రయత్నాలు అక్కడితో ఆగిపోయాయి. అయితే దానిని ఉదహరిస్తూ కేసీఆర్ పార్టీ ఏపీలోకి రావాలని చూస్తే తన్ని తరిమేస్తామంటూ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. అయితే తన సామాజిక వర్గం విషయంలో అలా జరిగిందని ఆయన మాట్లాడి ఉండవచ్చు కానీ.. తెలంగాణలో మరోసారి సెంటిమెంట్ అస్త్రాన్ని అందించినట్లు అయిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే పవన్ కేవలం దిష్టి అన్న వ్యాఖ్య చేసినందుకే రచ్చ రచ్చ చేశారు. కచ్చితంగా ఇప్పుడు ఏపీ మంత్రి వ్యాఖ్యలను వారు రాజకీయంగా వాడుకుంటారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# కలకలం రేపుతున్న 1000 కోట్ల లెక్కలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

జకీయ నాయకులు అన్నాక విమర్శలు చేయడం సహజం. కొన్ని సంచలన ఆరోపణలు చేయడం కూడా సహజం. కానీ, తెర వెనుక జరిగే విషయాలను బయట పెడితే మాత్రం.. రాజకీయ నాయకుల అసలు రంగు బయటపడుతుంది. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అసలు రూపాన్ని బయటపెట్టాయి.తెలంగాణ రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్ దాదాపు సగం దశకు వచ్చినప్పటికీ ఇంతవరకు రైతు భరోసా ఇవ్వలేదు. సన్న వడ్లకు బోనస్ మొన్న అంటే మొన్న వేశారు. రైతులు రైతు భరోసా డబ్బుల కోసం కళ్ళు కాయలు కాసే విధంగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి క్రమంలో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం నుంచి 1000 కోట్లను కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు పంపిద్దామని చెప్పడం రాజకీయంగా దుమారాన్ని రేపుతోంది. ఇప్పటికే గులాబీ పార్టీ నేతలు అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మార్చారని ఆరోపిస్తున్నారు.పదేపదే రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ హై కమాండ్ వద్దకు తెలంగాణ నాయకులు వెళ్లారు. ఆ సమయంలో 1000 కోట్ల గురించి ప్రస్తావన వచ్చిందని.. కేరళ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ఖర్చుల కోసం తెలంగాణ నుంచి డబ్బులు పంపించాలని కాంగ్రెస్ పెద్దలు సూచించారని.. కేరళ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా కేసీ వేణుగోపాల్ ను నియమించామని.. తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం చెప్పినట్టు గులాబీ పార్టీ తన మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేసింది.వాస్తవానికి దీనికి సరైన కౌంటర్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాలేదు. దీంతో అందరూ అదే నిజమనే భావనతో ఉన్నారు. అయితే కొంతమంది మాత్రం ఇది రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టడానికి గులాబీ పార్టీ చేస్తున్న ప్రయత్నం అని అనుకున్నారు. రేవంత్ రెడ్డి మాటలతో ఆ వెయ్యి కోట్ల వ్యవహారం అబద్ధం కాదని.. కావాలని చేస్తున్న ప్రచారం అంతకంటే కాదని.. అది నిజమని తేలిపోయింది. " గాంధీ కుటుంబానికి ఆర్థిక అవసరాలు ఉన్నాయని.. అందరం కలిసి తెలంగాణ నుంచి 1000కోట్ల రూపాయలు సమకూర్చి ఇవ్వగలిగే శక్తి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉందని" రేవంత్ రెడ్డి అనడం సంచలనాన్ని కలిగిస్తోంది.సాధారణంగా చూస్తే రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్లో పెద్దగా తప్పు కనిపించడం లేదు. రేవంత్ రెడ్డి ఇస్తామని చెప్పిన డబ్బులు ప్రభుత్వం నుంచి కాదు.. కేవలం కార్యకర్తలం అందరం కలిసి డబ్బులు ఇస్తామని అన్నారు. విరాళాల రూపంలో కార్యకర్తలు ఇవ్వగలరు అనేది రేవంత్ రెడ్డి ఉద్దేశం. కానీ ఈ మాట ఎందుకు దుమారమైందంటే.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ తరహాలో రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ప్రభుత్వంలో ఉన్నారు కాబట్టి.. ప్రభుత్వ సొమ్ము 1000 కోట్లను కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి ఇస్తున్నారని గులాబీ పార్టీ ప్రచారం చేస్తోంది. ఎప్పటి మాదిరిగానే దీనికి కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు "నన్ను కోసినా డబ్బులు లేవు" అని చెబుతూ, అదే సమయంలో తెలంగాణ నుండి ఏఐసీసీకి ?1000 కోట్లు పంపగలమని గర్వంగా ప్రకటించడం విరుద్ధంగా కనిపిస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్స్

విజయవాడ ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీలు , మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అయితే బీసీ రిజర్వేషన్ల ఖరారు ఈ ప్రక్రియలో అత్యంత కీలకంగా మారింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఒక స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి బీసీల సామాజిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేస్తోంది. నివేదిక సమర్పించడానికి 45 రోజుల సమయం ఉండటంతో మార్చి చివరి వారం వరకు ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం కనిపిస్తోంది.ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు విద్యార్థులకు వార్షిక పరీక్షలు, బోర్డు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. సాధారణంగా ఎన్నికల సమయంలో పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగిస్తారు. అలాగే ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొనవలసి ఉంటుంది. దీనివల్ల విద్యార్థుల విద్యాసంవత్సరం దెబ్బతినకూడదని ప్రభుత్వం భావిస్తోంది. పరీక్షల షెడ్యూల్‌కు ఆటంకం కలగకుండా ఉండేలా ఎన్నికల ప్రక్రియను వేసవి సెలవులకు మళ్లించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం వార్డుల వారీగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనుంది. దీనివల్ల గతంలో ఉన్న రిజర్వేషన్ల గణాంకాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. బీసీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా పదవుల కేటాయింపు జరగాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ గణన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లెక్కలు తేలిన తర్వాతే రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడానికి మార్గం సుగమం అవుతుంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం ఎస్ఈసీగా ఉన్న నీలం సహాని పదవీకాలం త్వరలో ముగియనుండటంతో ఆ స్థానంలో ఎవరిని నియమిస్తారనే చర్చ మొదలైంది. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అనుభవజ్ఞుడైన అధికారిని నియమించడం ద్వారా ఎన్నికలను పారదర్శక పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.పరీక్షల ముగింపు మరియు రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే మే నెలలో నోటిఫికేషన్ వెలువడే సూచనలు ఉన్నాయి. మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో పోలింగ్ నిర్వహించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేసవి సెలవుల సమయంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ యంత్రాంగానికి కూడా సౌకర్యంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. త్వరలోనే ఈ అంశంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# వైసీపీ కోసం పాకులాట

విజయవాడ, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఇప్పుడు వింత ధోరణి కనిపిస్తోంది. తెలంగాణలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం, తమ సొంత పార్టీ ప్రయోజనాల కంటే పొరుగు రాష్ట్రంలోని వైసీపీ కోసం ఓవర్ టైమ్ పనిచేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఏ పార్టీ సోషల్ మీడియా విభాగామైనా తమ నాయకుడిని ప్రమోట్ చేసుకోవడం లేదా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంపై దృష్టి పెడుతుంది. కానీ, బీఆర్ఎస్ డిజిటల్ సైన్యం మాత్రం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ లక్ష్యంగా సోషల్ మీడియాలో భారీ యుద్ధమే చేస్తోంది.బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు తమ పోస్టింగ్స్‌లో ఎక్కువ శాతం ఏపీ రాజకీయాలకే కేటాయిస్తున్నారు. టీడీపీ నాయకులపై విమర్శలు చేయడం, వైసీపీ వాదనను గట్టిగా వినిపించడం వీరి ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. తిరుమల లడ్డూ వ్యవహారం కావచ్చు లేదా ఇతర రాజకీయ అంశాలు కావచ్చు, వైసీపీ డిఫెన్స్‌లో ఉన్న ప్రతిసారీ బీఆర్ఎస్ అనుకూల హ్యాండిల్స్ ఆ పార్టీకి అండగా నిలబడుతున్నాయి. ఈ క్రమంలో టీడీపీ మద్దతుదారులతో నిరంతరం వివాదాలకు దిగుతూ, ఏపీ రాజకీయాల్లో వేలు పెడుతున్నారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు.వైసీపీకి మద్దతు ఇచ్చే క్రమంలో బీఆర్ఎస్ తన సొంత అస్తిత్వాన్ని పక్కన పెడుతోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై చేయాల్సిన పోరాటం కంటే, ఏపీలో టీడీపీని అడ్డుకోవడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రచారం వల్ల బీఆర్ఎస్ పార్టీకి ఒరిగేదేమీ లేదని క్షేత్రస్థాయి కార్యకర్తలు భావిస్తున్నారు. పార్టీ ప్రధాన వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన సమయంలో, ఇతర పార్టీల తరపున బ్యాటింగ్ చేయడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటోంది.తెలంగాణ నుంచి అందుతున్న ఈ సోషల్ మీడియా మద్దతు వైసీపీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది ప్రశ్నార్థకమే. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ రాష్ట్ర సమస్యలపై స్పందించేటప్పుడు పక్క రాష్ట్ర పార్టీల జోక్యాన్ని ఎంతవరకు స్వాగతిస్తారనేది ఆలోచించాల్సిన విషయం. పైగా, ఈ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయన్న ప్రచారం వల్ల రెండు పార్టీలు ఒక్కటే అనే ముద్ర పడే ప్రమాదం ఉంది. ఇది ఇటు ఏపీలో వైసీపీకి, అటు తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా ప్రతికూల ఫలితాలను ఇచ్చే అవకాశం లేకపోలేదు.బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం ఈ సోషల్ మీడియా ధోరణిని గమనిస్తోందో లేదో కానీ, నెటిజన్లు మాత్రం దీనిపై సెటైర్లు వేస్తున్నారు. తెలంగాణ గడ్డపై తమ గళాన్ని వినిపించడంలో వెనుకబడి, ఏపీ రాజకీయాల్లో తలదూర్చడం వల్ల పార్టీ గ్రాఫ్ తగ్గుతోందని విశ్లేషణలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే లైకులు, షేర్లు ఓట్లుగా మారవు అన్న కనీస సత్యాన్ని విస్మరించి, కేవలం ఎదుటి పక్షంపై విద్వేషాన్ని వెదజల్లడమే పనిగా పెట్టుకోవడం వల్ల పార్టీ విశ్వసనీయత దెబ్బతినే అవకాశం ఉంది.

### ఎవడిగోల వాడిదే

# లడ్డూ అంశంలో సమాధానంలేని ప్రశ్నలెన్నో

తిరుపతి, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సెగలు పుట్టిస్తోంది. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ ఒకరిపై ఒకరు విమర్శల యుద్ధం చేసుకుంటున్నాయి. ఈ వివాదంలో అసలు నిజానిజాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఇరు పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా జరిగిందంటూ టీడీపీ ఆధారాలతో సహా బయటపెట్టగా, వైఎస్సార్‌సీపీ దీనిని తీవ్రంగా ఖండిస్తోంది. జంతు కొవ్వు లేదని తమకు క్లీన్ చిట్ లభించిందంటూ సోషల్ మీడియాలో భారీగా ప్రచారం మొదలుపెట్టింది. అయితే, సరఫరా అయిన పదార్థం అసలు నెయ్యే కాదని సిట్ నివేదికలో తేలినప్పుడు క్లీన్ చిట్ అనే మాట ఎక్కడ నుంచి వచ్చిందని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇలా రోజుకో కొత్త మలుపుతో ఈ వ్యవహారం రచ్చకెక్కుతోంది.వైఎస్సార్‌సీపీ తనను తాను సమర్థించుకునే క్రమంలో ఇందాపూర్ డెయిరీ ప్రస్తావనతో పాటు హెరిటేజ్ సంస్థను కూడా వివాదంలోకి లాగింది. వాస్తవానికి ఈ కల్తీ నెయ్యి సరఫరాకు, హెరిటేజ్ సంస్థకు ఎటువంటి సంబంధం లేకపోయినా, రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల అసలు చర్చ పక్కదారి పట్టి, సంస్థల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలే ప్రధానంగా మారుతున్నాయప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో వైసీపీ తరపున టీటీడీ విషయాల్లో న్యాయపోరాటం చేసిన సుబ్రహ్మణస్వామి ఏకసభ్య కమిటీకి వ్యతిరేకంగా పిటిషన్ వేశారు. కానీ అనుకూల తీర్పు రాలేదు. అటు ప్రభుత్వం మాత్రం తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తి లేదని, ఏకసభ్య కమిటీ ద్వారా పూర్తి వివరాలు సేకరిస్తున్నామని చెబుతోంది. ఈ రాజకీయ రణరంగంలో భక్తుల ఆవేదనను అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం పూర్తిగా విస్మరించాయనే విమర్శలు వస్తున్నాయి. కోట్ల మంది హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం అపవిత్రం అయిందనే బాధ భక్తుల్లో ఉంది. కానీ, నేతలు మాత్రం తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి, ప్రత్యర్థిని బద్నాం చేయడానికి పడుతున్న తాపత్రయం చూసి సామాన్య భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆరోపణలతో కాలక్షేపం చేయకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటమే అసలైన పరిష్కారం. ఆలయ పవిత్రతను కాపాడటం, నాణ్యమైన ముడి పదార్థాల సేకరణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రాజకీయ చదరంగంలో భక్తిని పావుగా వాడుకోకుండా, తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని భక్తుల డిమాండ్ గా మారింది.


**భస్మాసుర హస్తం అవుతుందా**

భస్మాసుర హస్తం గురించి.. ఇట్టే తెలిసిపోతుంది. పురాణ గాథలపై అవగాహన ఉన్నవారు ఈ విషయాన్ని ఇట్టే గ్రహించగలరు. శివుడు తపస్సుతో బ్రహ్మాసురుడు ఒక వరం పొందుతాడు. తాను ఎవరి తలపై చేయి పెడితే వారు భస్మం అయ్యేలా వరం అది. చివరకు శివుడునే సంహరించాలనుకుంటాడు. కానీ మోహిని రూపంలో ఉన్న విష్ణువు అదే భస్మాసురుడిని తన చేయితోనే అంత బంధించి.. లోక కళ్యాణం పరిసమాప్తం చేస్తాడు. అయితే ఇప్పుడు అదే భస్మాసురుడి మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన రాజకీయం రివర్స్ అయ్యింది. చేజేతులా సుప్రీంకోర్టుకు వెళ్లి ఏపీ ప్రభుత్వానికి సహకారం అందించేలా చేసింది. సుప్రీంకోర్టులో తాజాగా ఏపీ ప్రభుత్వ చర్యలకు అనుమతులు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దగ్గర ఉండి ప్రభుత్వానికి అనుకూలంగా ఆదేశాలు వచ్చేలా చేసిందిటీటీడీ లడ్డుకు సంబంధించి నెయ్యి కల్తీ వ్యవహారం గత కొన్ని నెలలుగా ఏపీలో నలుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విచారణ జరిపితే తమకు ఇబ్బందులు వస్తాయని భావించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. టీటీడీ మాజీ అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సిబిఐ నేతృత్వంలో విచారణ జరగాలని కోరారు. అయితే దీనిపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. సిబిఐ నేతృత్వంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఏడాదికి పైగా విచారణ చేపట్టిన సిట్.. తమ విచారణ నివేదికను చార్జ్ షీట్ రూపంలో కోర్టుకు సమర్పించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. అందులో లోపాలను సైతం సరిదిద్దుకోవాలని భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించింది.ఏదైనా ఒక దర్యాప్తు సంస్థ ఒక అంశంపై విచారణ చేపట్టి చార్జ్ షీట్ దాఖలు చేస్తే.. చర్యలకు ఆదేశిస్తే.. అందులో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుమానంగా పరిగణించింది. అందుకే మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామిని రంగంలోకి దించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకసభ్య కమిటీని తప్పు పట్టి విమర్శలు చేసి ఉంటే కొంత వరకు వర్క్ అవుట్ అయ్యేది. ప్రజల్లో అనుమానం కలగడానికి అవకాశం కలిగేది. కానీ సుబ్రహ్మణ్యస్వామి ద్వారా ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తీర్పు అనుకూలంగా వస్తే మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని చూసింది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ కరెక్ట్ అని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చేలా చేయడంలో వైసిపి విజయవంతం అయింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్ని దారులు మూసుకుపోయాయి. ఏక సభ్య కమిటీ ఇచ్చిన నివేదికలు ఫైనల్ కానున్నాయి. అందులో ప్రతికూల అంశాలు వచ్చిన నోరు తెరిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశమే లేదు. ఇది ముమ్మాటికి ఆ పార్టీకి భస్మాసుర హస్తమే..

# 15 వేల మందికి పదవులు...

కర్నూలు, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గట్టి వ్యూహంతోనే ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో దారుణంగా దెబ్బతింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కనీసం ప్రతిపక్ష హోదా రాలేదు. వచ్చే ఎన్నికల్లో గెలిస్తేనే ఆ పార్టీకి భవిష్యత్. లేకుంటే ప్రమాదంలో పడినట్టే. అందుకే ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు జగన్మోహన్ రెడ్డి. వారంలో మూడు రోజులపాటు తాడేపల్లి నివాసంలో గడుపుతున్నారు. నాలుగు రోజులపాటు బెంగళూరులోని ఎలాహంక ప్యాలెస్ లో ఉంటున్నారు. అయితే పక్కా రాజకీయ వ్యూహాలను అమలు చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేయడం పైనే పూర్తిగా దృష్టిపెట్టారు. ముఖ్యంగా బూత్ లెవెల్ నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్రణాళిక. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి నియోజకవర్గంలో 15వేల మందికి పార్టీ అనుబంధ సంఘాల్లో పదవులు ఇస్తుండడం విశేషం.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాలు విచిత్రంగా ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రతి నాయకుడికి.. ప్రతి కార్యకర్తకి ఈ అనుబంధ సంఘాల్లో పదవులు దక్కుతున్నాయి. విచిత్రం ఏంటంటే అసలు తమకు పదవులు వచ్చాయన్న విషయం చాలామందికి తెలియదు. 2012లో పార్టీ ఆవిర్భవించింది. ఒకసారి అధికారంలోకి వచ్చింది. రెండుసార్లు ఓడిపోయింది. అయితే 2024 ఎన్నికల్లో ఓటమితోనే ఆ పార్టీలో మార్పు వచ్చింది. అంతకుముందు పార్టీ కార్యవర్గాలతో పాటు అనుబంధ విభాగాల్లో ఎవరికీ చోటు ఉండేది కాదు. కానీ ఇప్పుడు పార్టీలో కార్యకర్త నుంచి అధినేత వరకు అందరికీ పదవులు పని చేశారు. అలా పదవులు ఇస్తే పార్టీలో కొనసాగడమే కాకుండా పార్టీ కోసం పని చేస్తారు అన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన.అయితే జనంలోకి వచ్చేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధపడుతున్నారు. ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. ఈ ఉగాది నాటి నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే బస్సు యాత్ర చేపట్టడం ద్వారా ప్రతి కార్యకర్తను కలవవచ్చు అన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన. అయితే ఇప్పటికే పార్టీ కార్యవర్గాలను ప్రకటించారు. కొన్ని నియోజకవర్గాల్లో ఈ సంస్థాగత నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని నియోజకవర్గాల్లో ఇంకా పెండింగ్లో ఉన్నాయి.



అయితే ఉగాదికి మరో మూడు వారాలకు పైగా గడువు ఉంది. ఇంతలో వీటి నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. పార్టీలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడికి పార్టీ పదవులు ఇచ్చారు. దీంతో జగన్మోహన్ రెడ్డి పర్యటన మరింత సక్సెస్ అయ్యేలా వారు చూస్తారన్నది ఆలోచన. మరి ఈ ఆలోచన ఎంతవరకు వర్కౌట్ అవుతుంది అనేది చూడాలి.

# స్వర్ణదేవాలయం స్థాయిలో తిరుమల...

తిరుమల, ఫిబ్రవరి 25, లక్ష్యం న్యూస్

తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటంతో పాటు, పాలనలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో తిరుమలకు కూడా ప్రత్యేక చట్టం తీసుకురావాలనే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యత, పాలకమండలి నియామకాలపై అనేక వివాదాలు తలెత్తుతున్నందున టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. స్వర్ణ దేవాలయాన్ని నిర్వహిస్తున్న శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ తరహాలో టీటీడీకి పూర్తి స్వయం ప్రతిపత్తిని కల్పించే చట్టం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల ప్రభుత్వాలు మారినా ఆలయ పవిత్రతకు, సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ఉంటుంది.పంజాబ్‌లోని సిక్కుల పవిత్ర క్షేత్రమైన స్వర్ణ దేవాలయం నిర్వహణను 1925 నాటి సిక్కు గురుద్వారా చట్టం ద్వారా పర్యవేక్షిస్తారు. ఈ చట్టం ప్రకారం, గురుద్వారాల నిర్వహణ బాధ్యతను రాజకీయ నాయకుల చేతుల్లో కాకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సిక్కు ప్రతినిధుల చేతుల్లో ఉంచుతారు. ఈ కమిటీకి సంబంధించి ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి. కమిటీ సభ్యులు కేవలం మతపరమైన అంశాలు, సామాజిక సేవ, ఆధ్యాత్మిక అభివృద్ధిపైనే దృష్టి సారిస్తారు.ప్రస్తుత టీటీడీ చట్టం ప్రకారం, పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమిస్తోంది. దీనివల్ల అధికార పార్టీకి చెందిన నాయకులు, వ్యాపారవేత్తలు బోర్డులో చోటు సంపాదిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ స్వర్ణ దేవాలయ తరహా చట్టం అమలులోకి వస్తే, టీటీడీ బోర్డు సభ్యులు ఎన్నికల ద్వారా లేదా నిర్ణీత అర్హతలు ఉన్న ఆధ్యాత్మిక వేత్తల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రాజకీయ ఒత్తిళ్లకు తావుండదు. పారదర్శకత పెరుగుతుంది.స్వర్ణ దేవాలయ కమిటీ తన నిధులను కేవలం విద్య, వైద్యం, మత ప్రచారానికి మాత్రమే ఉపయోగిస్తుంది. నిధుల వ్యయంపై కఠినమైన ఆడిటింగ్ ఉంటుంది. తిరుమలలో కూడా భక్తులు సమర్పించే కానుకలు ఇతర ప్రభుత్వ అవసరాలకు కాకుండా, కేవలం ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు , సనాతన ధర్మ ప్రచారానికే వాడేలా కఠిన నిబంధనలు ఈ కొత్త చట్టంలో చేర్చే అవకాశం ఉంది. ఇది టీటీడీ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తుంది.స్వర్ణ దేవాలయ చట్టం ఏపీలో అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రభుత్వం న్యాయ నిపుణులు , ఆధ్యాత్మికవేత్తలతో కూడిన కమిటీని నియమించే ఆలోచనలో ఉంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాల నిర్వహణ విధానాలను అధ్యయనం చేసిన తర్వాత, ఏపీ కేబినెట్ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది. దేవాలయం పట్ల అచంచలమైన భక్తి, నిబద్ధత ఉన్నవారే బోర్డులో ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కేవలం పరిపాలన మార్పులకే పరిమితం కాకుండా, లడ్డూ తయారీలో వాడే ముడి పదార్థాల సేకరణ నుండి దర్శనం వరకు ప్రతి స్థాయిలోనూ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం ఆచరణలోకి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలకు తిరుమల ఒక ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# కాంగ్రెస్ ను టార్గెట్ చేసిన జగన్

**కడప, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్**

అంతర్జాతీయ వేదికగా జరిగిన ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ చేపట్టిన నిరసనలను జగన్ విమర్శించడం వివాదాస్పదమయింది. ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు భారత్ ప్రతిష్టను మసకబార్చేలా యూత్ కాంగ్రెస్ నేతలు ప్రవర్తించడం అక్షేపణీయమని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. రాజకీయ విభేదాలు ఏవైనా ఉండవచ్చు కానీ, అంతర్జాతీయ వేదికలపై దేశం ఐక్యంగా కనిపించాలని, భారత్‌ను ప్రపంచం ముందు చులకన చేయడం ఆమోదయోగ్యం కాదని వైసీపీ స్పష్టం చేసింది. జగన్ చేసిన ట్వీట్ పై యూత్ కాంగ్రెస్ స్పందించింది. కాంగ్రెస్ పార్టీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి సోషల్ మీడియా వేదికగా ఘాటు విమర్శలు చేసింది. మీ తండ్రి, మా గర్వించదగ్గ నాయకుడు దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి గారు తన జీవితమంతా మతతత్వ, విభజన , రాజీ పడే శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని, ప్రస్తుతం మీరు సిబిఐ, ఈడి కేసులను ఎదుర్కొంటున్న విషయం మాకు తెలుసని, అయితే కనీసం మీ తండ్రి ఆశయాలను, ఆయన వారసత్వాన్ని ఇలా బహిరంగంగా దిగజార్చవద్దని ఈ సందర్భంగా కాంగ్రెస్ పేర్కొంది. ఈ ట్వీట్ పై అంబటి రాంబాబు స్పందించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వారసత్వం గురించి ఇప్పుడు మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు, ఆయన మరణం తర్వాత ఆ కుటుంబాన్ని ఎంతగా వేధించారో దేశమంతా చూసిందని అన్నారు. వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్ లో చేర్చి, ఆయన మరణానంతరం గౌరవాన్ని తగ్గించేలా ప్రవర్తించింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. తమ రాజకీయ అవసరాల కోసం చరిత్రను వక్రీకరిస్తూ ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. రాజకీయ సమీకరణాలతో సంబంధం లేకుండా, జాతీయ ప్రయోజనాల విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో ఉందని అంబటి చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికలు, పార్లమెంట్‌లో కీలక బిల్లుల విషయంలో తమ పార్టీ దేశ హితానికే మొగ్గు చూపిందని, సంకుచిత రాజకీయాల కోసం స్టాండ్ మార్చుకోలేదని స్పష్టం చేసింది.

# కంటి మీద కునుకు లేకుండా భారతీ సిమెంట్స్

కడప, ఫిబ్రవరి 24, లక్ష్యం న్యూస్

కడప జిల్లా కమలాపురం ప్రాంతంలో విస్తరించిన భారతి సిమెంట్స్ కర్మాగారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. భూములిచ్చిన రైతులకు కనీస న్యాయం చేయలేదని , స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా శ్రమదోపిడీకి పాల్పడుతోందని ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను గాలికొదిలేసి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కంపెనీ కేవలం లాభార్జనే ధ్యేయంగా సాగుతూ స్థానిక వనరులను కొల్లగొడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భారతి సిమెంట్స్ ఏర్పాటు సమయంలో సుమారు 2,000 ఎకరాలకు పైగా భూమిని రైతుల నుంచి సేకరించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అప్పట్లో ఎకరాకు కేవలం కొన్ని వేల రూపాయలు మాత్రమే చెల్లించి అతి తక్కువ ధరకు రైతుల నోళ్లు కొట్టారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ అండదండలతో సాగించిన ఈ భూసేకరణలో బాధితులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదు. అటు రైతులు భూమిని కోల్పోయి ఇటు కంపెనీలో ఉపాధి దొరక్క అగమ్యగోచర స్థితిలో ఉన్నారు. అభివృద్ధి పేరుతో జరిగిన ఈ భూ దోపిడీపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ పెరుగుతోంది.భారతి సిమెంట్స్ సంస్థకు సుమారు 528 హెక్టార్ల సుమారు 1,300 ఎకరాలు మేర సున్నపురాయి గనుల లీజులు కేటాయించారు. అయితే ఈ లీజుల అన్నీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా రాయించుకున్నారు. అక్రమ మార్గాల్లో అనుమతులు పొందారని ఎన్నో ఏళ్లుగా న్యాయ పోరాటాలు సాగుతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలో అడ్డగోలుగా పొందిన ఈ లీజులను రద్దు చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న మైనింగ్ కార్యకలాపాల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది.ఈ కంపెనీలో ఫ్రెంచ్ సంస్థ అయిన వికాట్ 51 శాతం వాటాలను కొనుగోలు చేసి 15 ఏళ్లు గడిచినా వారి ప్రతినిధులు ఎక్కడా కనిపించకపోవడం ఒక పెద్ద మిస్టరీగా మారింది. రికార్డుల్లో వికాట్ మెజారిటీ వాటాదారుగా ఉన్నప్పటికీ నిర్వహణ అంతా జగన్ కుటుంబ సభ్యుల చేతుల్లోనే ఉండటం గమనార్హం. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థ నిర్ణయాల్లో ఎందుకు జోక్యం చేసుకోవడం లేదనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ పెట్టుబడుల వెనుక ఉన్న లోగుట్టును విచారణ సంస్థలు లోతుగా పరిశీలించి గుట్టు తేల్చాల్సి ఉన్నా.. ఇంకా విచారణ సాగుతూనే ఉంది.భారతి సిమెంట్స్ ఏటా సుమారు 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో వందల కోట్ల రూపాయల నికర లాభాలను గడిస్తోంది. కేవలం సిమెంట్ అమ్మకాల ద్వారానే కాకుండా ప్రభుత్వ కాంట్రాక్టుల సరఫరా ద్వారా ఈ సంస్థ భారీగా లబ్ధి పొందింది. ఇంత లాభం వస్తున్నా పర్యావరణ పరిరక్షణ కోసం పైసా ఖర్చు చేయడం లేదనేది స్థానికుల ప్రధాన ఫిర్యాదు. కర్మాగారం నుంచి వెలువడే దుమ్ము, వ్యర్థాల వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. బాధ్యతాయుతమైన కార్పొరేట్ సంస్థగా వ్యవహరించడంలో భారతి సిమెంట్స్ పూర్తిగా విఫలమైందనేది బహిరంగ సత్యం. జగన్ కుటుంబంపై అందుకే కడపలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P.
and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO